ఈనాటి

PRGI-NO-APTEL/25/A2739

# తెలుగోడు

EENAATI TELUGODU... Telugu Daily

https://www.eenaatitelugodu.com








సంపుటి-1 | సంచిక - 152 | సోమవారం 2 మార్చి 2026 | పేజీలు -6 | వెల - రూ.. 5

Published From - Vijayawada, Anantapur, Sri Satyasai, Kurnool, Nandyala, Kadapa, Annamayya, Srikakulam, Nellore, chittoor, Tirupati


## న్యాయం కోసం వచ్చే ప్రతిఒక్కరికీ

# న్యాయం అందాలి



- న్యాయరంగ మౌలిక వసతుల విస్తరణకు కీలక అడుగు...
- సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ శంకుస్థాపన..
- ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు హాజరు..
- న్యాయమూర్తులకు గౌరవప్రద వసతి సదుపాయాల ఏర్పాట్లు..
- సమావేశ మందిరాలు, భోజనశాల, ఆరోగ్య సదుపాయాలు నిర్మాణంలో భాగం..
- భద్రతా ప్రమాణాలతో సమగ్ర ప్రణాళిక..
- వేగవంతమైన న్యాయ సేవలకు మౌలిక వసతుల బలోపేతం..

**అమరావతి (తెలుగోడు),మార్చి 1 :**

అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ ఉన్నత న్యాయస్థానం సమీపంలో నిర్మించబడనున్న అతిథి గృహానికి ఘనంగా శంకుస్థాపన జరిగింది. భారత దేశ సర్వోన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ప్రధాన అతిథిగా హాజరై శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉన్నత న్యాయస్థానం ప్రధాన న్యాయమూర్తి, ఇతర న్యాయమూర్తులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఉన్నత న్యాయస్థానం సమీపంలో నిర్మించబడనున్న ఈ అతిథి గృహం న్యాయమూర్తులు, ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే న్యాయవర్గ ప్రతినిధులు, విశిష్ట అతిథులకు సౌకర్యవంతమైన వసతి కల్పించే విధంగా రూపుదిద్దుకోనుంది. విశాల గదులు, సమావేశాల కోసం ప్రత్యేక మందిరాలు, భోజనశాల, ఆరోగ్య సంరక్షణ వసతులు, వినోద ఏర్పాట్లు వంటి సదుపాయాలు ఇందులో ఏర్పాటు చేయనున్నారు. భద్రతా ప్రమాణాలను పాటిస్తూ సమగ్ర ప్రణాళికతో నిర్మాణం చేపడుతున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు మాట్లాడుతూ అమరావతిని సమగ్ర రాజధానిగా తీర్చిదిద్దే క్రమంలో న్యాయరంగ అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. న్యాయమూర్తులకు గౌరవప్రదమైన వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని పేర్కొన్నారు. న్యాయ వ్యవస్థ స్వతంత్రతను కాపాడటంతో పాటు ప్రజలకు వేగవంతమైన న్యాయ సేవలు అందేలా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. నిర్మాణ పనులు నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. సర్వోన్నత న్యాయస్థాన ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ మాట్లాడుతూ న్యాయ వ్యవస్థ బలపడాలంటే సరైన మౌలిక వసతులు అత్యవసరమన్నారు. న్యాయమూర్తులకు అనుకూలమైన వసతి, శిక్షణా సదుపాయాలు, పరిపాలనా వాతావరణం ఉంటే న్యాయ సేవల నాణ్యత మరింత మెరుగవుతుందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు అభినందనీయమని, అమరావతిలో చేపడుతున్న ఈ నిర్మాణం న్యాయ వ్యవస్థ ప్రతిష్ఠను మరింత పెంచుతుందని తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టే విధంగా పారదర్శకతతో పని చేయాలని. న్యాయానికి న్యాయం అందేలా కృషి చేయాలన్నారు.

## పోలవరాన్ని కుదించి రైతాంగానికి

# తీరని ద్రోహం

- 45.78 అడుగుల నుంచి 41 అడుగులకు ఎత్తు తగ్గింపు ...
- కేంద్రం నిర్ణయంపై సీఎం ఎందుకు మౌనం వహించారని ప్రశ్న..
- ప్రతి రైతు ప్రశ్నించాలని వైఎస్సార్సీపీ పిలుపు..
- ఇది రాజకీయ సమస్య కాదని స్పష్టం..
- రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ వెంటనే ప్రారంభించాలని డిమాండ్..
- పక్క రాష్ట్రాల అక్రమ ప్రాజెక్టులను అడ్డుకోవాలన్న సూచన..
- అసెంబ్లీలో తీర్మానంకై ముందుకురాలేదని ఆక్షేపణ..
- గ్రామం నుంచి విశ్వవిద్యాలయం వరకు చైతన్య యాత్రకు సిద్ధం..
- భవిష్యత్తులో వైఎస్ జగన్ కూడా ఉద్యమంలో పాల్గొంటారని వెల్లడి..
- చంద్రబాబుపై సజ్జల ఘాటు విమర్శలు..



**తాడేపల్లి (తెలుగోడు), మార్చి 1 :**

ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తీసుకుంటున్న నిర్ణయాలన్నీ రాష్ట్ర ప్రయోజనాలను దెబ్బతీసే విధంగా ఉన్నాయని వైఎస్సార్సీపీ రాష్ట్ర కోఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి తీవ్రంగా ఆరోపించారు. వైఎస్ జగన్ హయాంలో పోలవరం ప్రాజెక్టు ఎత్తును 45.78 అడుగుల మేర నిర్మాణం చేపట్టగా, చంద్రబాబు అధికారంలోకి వచ్చిన తర్వాత దానిని 41 అడుగులకు కుదించారని మండిపడ్డారు. కేంద్ర ప్రభుత్వం ఎత్తు తగ్గించే నిర్ణయం తీసుకుంటే ముఖ్యమంత్రి కిమ్మనలేదని ప్రశ్నించారు. ప్రతి రైతు ఈ అంశంపై ప్రశ్నించాలనీ, ప్రతి ఇంట్లో దీనిపై చర్చ జరగాలని సజ్జల పిలుపునిచ్చారు. ఇది రాజకీయ సమస్య కాదని, రాష్ట్ర హక్కును రక్షించుకునే పోరాటమని స్పష్టం చేశారు. కింది స్థాయి టీడీపీ నాయకుడి నుంచి ముఖ్యమంత్రి వరకు అందరినీ ప్రజలు ప్రశ్నించాలన్నారు. కూటమిలో ఉన్న జనసేన, బీజేపీ నాయకులను కూడా నిలదీయాలని సూచించారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ పనులను వెంటనే ప్రారంభించాలని డిమాండ్ చేసిన సజ్జల, పక్క రాష్ట్రాలు అక్రమంగా నిర్మిస్తున్న ప్రాజెక్టులను చట్టపరంగా అడ్డుకోవాలని ప్రభుత్వాన్ని కోరారు. కేంద్రంలో భాగస్వామిగా ఉన్నప్పటికీ అదనపు ప్రయోజనాలు సాధించకుండా, ఉన్న (మిగతా 2లో)

## పశ్చిమాసియా సంక్షోభం

# భారతీయుల రక్షణపై మోదీ అత్యవసర సమీక్ష

- గల్ఫ్ దేశాల్లో చిక్కుకున్న భారతీయుల భద్రతపై ఆందోళన..
- రాత్రి 9.30కు ఢిల్లీలో భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీ భేటీ..
- భారత్ వైఖరిపై కీలక నిర్ణయాలకు సంకేతాలు..




**న్యూ ఢిల్లీ (తెలుగోడు),మార్చి 1 :**

ఇరాన్‌పై అమెరికా సంయుక్త రాష్ట్రాలు, ఇజ్రాయెల్ కలిసి చేపట్టిన సైనిక చర్యలు, దానికి ప్రతీకారంగా ఇరాన్ తీవ్రంగా స్పందించడం వల్ల పశ్చిమాసియాలో పరిస్థితులు ఆందోళనకరంగా మారాయి. దశాబ్దాలుగా అక్కడే నివసిస్తున్న భారతీయులు, పర్యాటక వీసాలపై వెళ్లిన (మిగతా 2లో)

## టిటిడి ఛైర్మెన్ పదవికి

# రాజీనామా చేయాలి

- ఏఐ, డీప్ ఫేక్ వాదనను ఖండించిన భూమన..
- బీఆర్ నాయుడుపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి..



**తాడేపల్లి (తెలుగోడు),మార్చి 1 :**

భూమన కరుణాకర్ రెడ్డి తాజాగా తాడేపల్లిలో మీడియాతో మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానాలు ఛైర్మన్ బీఆర్ నాయుడుకు సంబంధించిన కొన్ని వీడియోలు, ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో చక్కర్లు కొడుతున్నాయని పేర్కొన్నారు. ఈ దృశ్యాలతో హిందువుల మనోభావాలు తీవ్రంగా దెబ్బతిన్నాయని ఆయన ఆరోపించారు. 94 సంవత్సరాల టీటీడీ పాలక మండలి చరిత్రలో ఎన్నడూ లేని విధంగా పరిస్థితులు ఏర్పడ్డాయని విమర్శించారు. ఘటన వెలుగులోకి వచ్చిన వెంటనే ఛైర్మన్ పదవికి రాజీనామా చేయాల్సిందని, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తి మౌనంగా తప్పుకోవడం మంచిదని భూమన సూచించారు. (మిగతా 2లో)

## అంగన్‌వాడీల సంక్షేమానికి

# కట్టుబడి వున్నాం

- రెండుసార్లు వేతనాల పెంపు చరిత్రలో తొలిసారి..
- ప్రతి నెల ఒకటో తేదీనే జీతాలు..
- రూ.86.68 లక్షలతో మౌలిక సదుపాయాల అభివృద్ధి..
- 58,204 మందికి 5జీ స్మార్ట్ ఫోన్లు
- హాజరు శాతం 70 నుంచి 96కి పెరుగుదల..
- గ్రాట్యుటీకి రూ.20 కోట్ల కేటాయింపు..
- 5,000 మినీ కేంద్రాల అప్‌గ్రేడ్, 5,000 కొత్త సహాయకుల నియామకం..
- హోంమంత్రి అనిత...



**అమరావతి (తెలుగోడు),మార్చి 1 :**

అంగన్వాడీ కార్యకర్తలు, సహాయకులు, చిరు ఉద్యోగుల సంక్షేమానికి కూటమి ప్రభుత్వం పూర్తిగా కట్టుబడి ఉందని రాష్ట్ర హోం శాఖ మంత్రి వంగలపూడి అనిత స్పష్టం చేశారు. ఆదివారం అమరావతిలో అంగన్వాడీ కార్యకర్తలతో మాట్లాడిన ఆమె, గతంలో ఎన్నడూ లేని విధంగా చరిత్రలోనే తొలిసారిగా రెండు సార్లు అంగన్వాడీ వేతనాలు పెంచిన ఘనత తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంతోపాటు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకు దక్కుతుందని పేర్కొన్నారు. ఎన్నికల్లో అంగన్వాడీలకు ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడానికి కూటమి ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన (మిగతా 2లో)





## మహిళల భద్రత

# అందరి బాధ్యత

- ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకు మహిళా దినోత్సవ ర్యాలీ..
- మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యం..
- వారం రోజులపాటు మహిళా దినోత్సవ వారోత్సవాలు..
- విద్యతోనే కుటుంబం ఉన్నత స్థాయికి..
- శక్తి బృందాల చట్టపరమైన అవగాహన కార్యక్రమం..
- విద్యార్థినీలు, మహిళల భారీ భాగస్వామ్యం..
- సమాన హక్కులు కల్పిద్దామని కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్ పిలుపు..

**పుట్టపర్తి (తెలుగోడు),మార్చి 1 :**

శ్రీసత్యసాయి జిల్లా పుట్టపర్తిలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని మహిళల భద్రత, గౌరవం, సాధికారతపై ప్రజల్లో చైతన్యం పెంపొందించే ఉద్దేశంతో పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. ఆర్టీసీ బస్టాండ్ నుంచి గణేష్ కూడలి వరకు సాగిన ఈ ర్యాలీలో కలెక్టర్ శ్యాంప్రసాద్, ఎస్పీ సతీష్ కుమార్, అదనపు ఎస్పీ అంకిత సురాన, ఆర్డీవో సువర్ణ, వివిధ విభాగాల అధికారులు, మహిళా పోలీస్ సిబ్బంది, శక్తి బృందాలు, కళాశాల విద్యార్థినీలు, మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ర్యాలీ అనంతరం గణేష్ కూడలిలో నిర్వహించిన సభలో కలెక్టర్ శ్యాంప్రసాద్ మాట్లాడుతూ (మిగతా 2లో)

## ఫేక్ దుష్ప్రచారం వెనుక కుట్రలు

# సిఎం చెప్తే రాజీనామా

- వైరల్ వీడియోపై ప్రెస్ ముందుకు వచ్చిన టీటీడీ ఛైర్మన్..
- వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీపై ఘాటు విమర్శలు..
- వ్యక్తిగత ప్రతిష్ఠ దెబ్బతీయాలనే యత్నమంటూ ఆరోపణ..
- మార్ఫింగ్ చేశారని వీడియోపై ఎద్దేవా



**తిరుపతి (తెలుగోడు),మార్చి 1 :**

సోషల్ మీడియాలో వైరల్ అవుతున్న వీడియోపై తిరుమల తిరుపతి దేవస్థానం ఛైర్మన్ బీఆర్ నాయుడు ఘాటుగా స్పందించారు. తొలుత ఈ వీడియోను డీప్ ఫేక్‌గా అభివర్ణిస్తూ ట్వీట్ చేసిన ఆయన తాజాగా విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి వివరణ ఇచ్చారు. తనను వ్యక్తిగతంగా అప్రతిష్టపాలు చేయడమే కాకుండా టీటీడీ ప్రతిష్టను దిగజార్చేందుకు పన్నాగాలు పన్నుతున్నారని ఆరోపించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నేతలపై ఆయన తీవ్ర విమర్శలు గుప్పించారు. టీటీడీ ఛైర్మన్‌గా ప్రమాణ స్వీకారం చేసిన తొలి రోజు నుంచే తనపై వైఎస్ఆర్సీపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని బీఆర్ నాయుడు తెలిపారు. ఎవరు చెప్పినా తాను రాజీనామా చేయబోనని స్పష్టం చేశారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తనను ఈ పదవికి నియమించారని, ఆయన ఆదేశిస్తే రాజీనామా చేయడానికి నిమిషం కూడా పట్టదని చెప్పారు. తనను రాజీనామా చేయమని అడగడానికి ఎవరికీ హక్కులేదని పరోక్షంగా భూమన (మిగతా 2లో)

## గల్ఫ్‌లో ఏపి వాసులకు భరోసా

# ఆందోళన అవసరం లేదు



- పరిస్థితులపై రాష్ట్ర ప్రభుత్వం నిరంతర పర్యవేక్షణ..
- విదేశాంగ శాఖతో సమన్వయం కొనసాగింపు..
- ఇండియన్ ఎంబసీలో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని సూచన..
- ఉద్రిక్త ప్రాంతాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి..
- మంత్రి కొండపల్లి శ్రీనివాస్..

**అమరావతి (తెలుగోడు),మార్చి 1 :**

గల్ఫ్ దేశాల్లో నివసిస్తున్న ఆంధ్రప్రదేశ్ వాసులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపడుతోందని మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఇవాళ ప్రకటించారు. స్థానిక అధికారులకు అందుబాటులో ఉంటూ అధికారిక మీడియా సమాచారాన్ని మాత్రమే అనుసరించాలని గల్ఫ్ దేశాల్లో ఉన్న ఏపీ వాసులను ఆయన కోరారు. ఆయా దేశాల్లో ఉన్న విద్యార్థులు, ఉద్యోగులు, పర్యాటకులు సహా ఇతర రాష్ట్రాల పౌరులు ఎవరూ కూడా భయపడాల్సిన అవసరం లేదని మంత్రి తెలిపారు. సాధారణ పరిస్థితులు నెలకొనే వరకు సంయమనం పాటించాలని, త్వరలోనే విమాన సర్వీసులు పునఃప్రారంభం కానున్నాయని వెల్లడించారు. ఇండియన్ ఎంబసీలలో ఆయా దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులు తప్పనిసరిగా నమోదు (మిగతా 2లో)

# రైతాంగానికి తీరని ద్రోహం

**(మొదటి పేజి (తరువాయి))**

ప్రాజెక్టులకే కత్తెర వేస్తున్నారని విమర్శించారు. వైఎస్ జగన్ కేంద్రంలో భాగస్వామి కాకపోయినా పోలవరాన్ని 45 మీటర్ల మేర ముందుకు తీసుకెళ్లారని, కానీ భాగస్వామిగా ఉన్న చంద్రబాబు 41 మీటర్లకు కుదించేందుకు ఒప్పుకోవడం దారుణమని పేర్కొన్నారు. 2014 నుంచి 2019 మధ్య పోలవరం ఎత్తు తగ్గించే ప్రయత్నాలు జరిగాయని, తర్వాత జగన్ పోరాడి నిధులు సాధించి పనులు ముందుకు నెట్టారని సజ్జల తెలిపారు. నిర్మాణంలో ఉన్న ప్రాజెక్టులను పూర్తి చేయకుండా, దశాబ్దాలు పట్టే కొత్త ప్రాజెక్టుల గురించి మాట్లాడటం సరికాదన్నారు. రాయలసీమ లిఫ్ట్ ప్రాజెక్టును నిలబెట్టుకోవడం తక్షణ కర్తవ్యమని స్పష్టం చేశారు.
రాష్ట్ర రైతాంగంపై పడే నష్టాన్ని ప్రజలు గమనించాలని సూచించిన సజ్జల, పక్క రాష్ట్రాలు అడ్డగోలు ప్రాజెక్టులు కడుతుంటే ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. కనీసం ఖండన చేయడం గానీ, అసెంబ్లీలో తీర్మానం తీసుకురావడం గానీ చేయడం లేదని ఆక్షేపించారు. రాయలసీమ లిఫ్ట్ కోసం ప్రజలందరినీ భాగస్వాములుగా చేసేందుకు ముందడుగు వేస్తామని తెలిపారు. గ్రేటర్ రాయలసీమ నేతలతో సమావేశమై ఉద్యమ కార్యాచరణపై చర్చించామని చెప్పారు. గ్రామాల నుంచి కళాశాలలు, విశ్వవిద్యాలయాల వరకు చైతన్యం పెంచి ప్రజలను ఉద్యమంలోకి తీసుకురావాలని నిర్ణయించామని వెల్లడించారు. భవిష్యత్తులో పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కూడా ఈ ఉద్యమంలో పాల్గొంటారని సజ్జల స్పష్టం చేశారు. ఇది రాజకీయ అంశం కాదని, రాష్ట్ర ప్రయోజనాల కోసం అందరూ కలిసి పోరాడాలని పిలుపునిచ్చారు.

# అత్యవసర సమీక్ష

**(మొదటి పేజి (తరువాయి))**

వారు ఇరాన్‌తో పాటు గల్ఫ్ దేశాల్లో చిక్కుకుపోయినట్లు సమాచారం. క్షిపణి దాడులు, సైనిక హెచ్చరికల మధ్య వారి భద్రతపై కుటుంబ సభ్యుల్లో తీవ్ర ఆందోళన నెలకొంది. ఇటీవల జరిగిన దాడుల్లో ఇరాన్ సుప్రీం నాయకుడు ఆయతుల్లా అలీ ఖమేనీ హత్యకు గురైనట్లు వచ్చిన వార్తలతో ప్రాంతీయ ఉద్రిక్తతలు మరింత పెరిగాయి. దీనికి ప్రతీకారంగా ఇరాన్ గల్ఫ్ దేశాల్లోని అమెరికా స్థావరాలపై క్షిపణులను ప్రయోగించినట్లు అంతర్జాతీయ వర్గాలు పేర్కొంటున్నాయి. ఈ పరిణామాలతో మధ్యప్రాచ్య ప్రాంతం యుద్ధ వాతావరణాన్ని తలపిస్తోంది.
భారత్--ఇజ్రాయెల్ సంబంధాలు ఇటీవలి కాలంలో బలపడ్డాయి. ఈ నేపథ్యంలో ఇరాన్, గల్ఫ్ దేశాల విషయంలో భారత్ ఎలా సమతౌల్య వైఖరి అవలంబించాలన్న దానిపై కేంద్ర ప్రభుత్వం గంభీరంగా ఆలోచిస్తోంది. పశ్చిమాసియాలో ఉన్న లక్షలాది భారతీయుల భద్రత, వారి తరలింపు చర్యలు అత్యవసరంగా మారాయి. ఈ నేపథ్యంలో ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ ఇవాళ రాత్రి అత్యున్నత స్థాయి సమావేశం నిర్వహించనున్నారు. గుజరాత్, రాజస్థాన్, పుదుచ్చేరి, తమిళనాడు రాష్ట్రాల్లో రెండు రోజుల పర్యటన ముగించుకుని రాత్రి 9.30 గంటలకు ఢిల్లీ చేరుకోనున్న ఆయన, అనంతరం భద్రతా వ్యవహారాల కేబినెట్ కమిటీతో భేటీ కానున్నారు. ఈ సమావేశంలో పశ్చిమాసియాలో తాజా పరిణామాలపై సమగ్ర సమీక్ష జరిపి, భారతీయుల రక్షణకు అవసరమైన చర్యలు, భవిష్యత్ వ్యూహంపై కీలక నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

# రాజీనామా చేయాలి

**(మొదటి పేజి (తరువాయి))**

అయితే ఈ వ్యవహారాన్ని రాజకీయంగా మలచి ఇతరులపై నెట్టే ప్రయత్నం జరుగుతోందని ఆయన ఆరోపించారు. తమ హయాంలో చిన్న వివాదం వచ్చినా వెంటనే చర్యలు తీసుకున్నామని, ఇప్పుడు మాత్రం అదే ప్రమాణాలు కనిపించడం లేదని విమర్శించారు. వైఎస్ జగన్పై మరియు ఆయన కుటుంబంపై చైర్మన్ గతంలో చేసిన వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ భూమన తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వీడియోలు కృత్రిమ మేధస్సుతో తయారు చేసినవని చెప్పడం నమ్మశక్యం కాదని, తాను కొందరు నిపుణులతో మాట్లాడిన తర్వాత అవి నిజమైనవేనని తెలిసిందని అన్నారు. డీప్ ఫేక్ అంటూ తప్పించుకునే ప్రయత్నం సరికాదని హెచ్చరించారు. ఈ ఘటనపై సమగ్ర దర్యాప్తు జరిపి అవసరమైతే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని భూమన కరుణాకర్ రెడ్డి డిమాండ్ చేశారు. ధార్మిక సంస్థ గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత అందరిపై ఉందని స్పష్టం చేశారు.

# గ్రామాల్లో పార్టీ బలోపేతమే లక్ష్యంగా పనిచేయాలి

## గ్రామాల అభివృద్ధి, సంక్షేమం, నాయకులు, కార్యకర్తల సమన్వయంపై లోతుగా విశ్లేషణ.. ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు ..

**రొళ్ల (తెలుగోడు), మార్చి 1 :**
మడకశిర నియోజకవర్గం, రొళ్ల మండలం, బొమ్మగొండనహల్లి, హెట్టిబెట్ట గ్రామాల టీడీపీ నాయకులతో స్థానిక శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా టీడీపీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు సమీక్షా సమావేశాన్ని క్యాంపు కార్యాలయంలో ఆదివారం నిర్వహించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలపై తోలుతా ఎమ్మెల్యే ఆరా తీశారు. గ్రామాల్లో రోడ్లు, మౌలిక సదుపాయాలు, బీటీ రోడ్లు, సీసీ రోడ్లు, కల్వర్టులు తదితర అంశాల విషయంలో ఉన్న సమస్యలను నాయకులు ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడి ప్రతి సమస్యను పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు. తదనంతరం గ్రామంలో పార్టీ బలోపేతం అంశంపై నాయకులతో ఎం.ఎస్.రాజు సమీక్షించారు. నాయకులు, కార్యకర్తల మధ్య సమన్వయం ఉండాలని....పార్టీ ఆదేశాలకు అనుగుణంగా గ్రామాల్లో పార్టీ ప్రభుత్వ సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన పెంచాలని సూచించారు. కూటమి పాలనలో రాష్ట్రానికి, మడకశిర నియోజకవర్గానికి జరుగుతున్న మంచిని ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాలని


బిజి హళ్లి నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎంఎస్ రాజు


హోట్టేబెట్టా పంచాయతీ నాయకులతో సమావేశమైన ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు

కోరారు. నాయకులు, కార్యకర్తలకు ఏ సమస్య ఉన్నా...తక్షణమే తన దృష్టికి తీసుకురావాలని ఆదేశించారు. మడకశిర నియోజకవర్గాన్ని అన్నివిధాలా అభివృద్ధి చేసుకునేందుకు ప్రయత్నిస్తున్నానని, ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా తగినన్ని నిధులు ఇస్తున్నారని ఎం.ఎస్.రాజు నాయకులకు వివరించారు. భవిష్యత్తులో నియోజకవర్గ అభివృద్ధిలో భాగంగా చేపట్టబోయే కార్యక్రమాలను యువతకు రాబోయే ఉద్యోగ అవకాశాలను కూడా ఎం.ఎస్.రాజు ప్రస్తావించారు. ప్రజాసమస్యల పరిష్కారానికి ప్రథమ ప్రాధాన్యతనివ్వాలని, అధికారులతో మాట్లాడి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించాలని కోరారు. గ్రామస్థాయిలో సమస్యలు పరిష్కారం కాకపోతే... తక్షణమే ఆ సమస్యలను తన దృష్టికి తీసుకురావాలని తెలిపారు. గ్రామంలో నాయకులు, అధికారులు సమన్వయంతో సంక్షేమ పథకాలను ప్రజలకు అందుబాటులోకి తీసుకెళ్లేలా ప్రణాళిక బద్ధంగా ముందుకు వెళ్లాలని ఆదేశించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర వక్కలిగా కార్పొరేషన్ చైర్మన్ లక్ష్మి నారాయణ,మార్కెట్ యార్డ్ చైర్మన్ గురుమూర్తి, రాష్ట్ర వక్కలిగా సాధికార కన్వీనర్ విఎం పాండురంగప్ప,ఏపీఐఐసి డైరెక్టర్ రామక్రిష్ణ, మండల పార్టీ కన్వీనర్ జి కె ఈరన్న, సింగల్ విండో అధ్యక్షులు దాసిరెడ్డి, మాజీ ఎంపీపీ క్రిష్ణప్ప,మాజీ సర్పంచ్ లక్ష్మినరసప్ప,మాజీ క్లస్టర్ ఇంచార్జ్ భరత్, క్లస్టర్ ఇంచార్జ్ మంజునాథ్, క్లస్టర్ కో కన్వీనర్ మారుతి,మండల ఆర్గనైజషన్ సెక్రటరీ శీనప్ప, నాయకులు రవికుమార్, రంగప్ప, తదితరులు పాల్గొన్నారు.

# గరుడోత్సవంపై చెన్నకేశవ స్వామి దర్శనం

**యాడికి (తెలుగోడు), మార్చి 1 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాలలో భాగంగా ఆదివారం గరుడోత్సవం పై శ్రీ శివ లక్ష్మి చెన్నకేశవ స్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఆదివారం ఆలయం నందు అర్చకులు భక్తులు ఆధ్వర్యంలో ఉదయం నిత్య పూజలు ప్రత్యేక పూజలు కార్యక్రమం నిర్వహించారు. ప్రాభాతిక మంగళ వాయిద్య, గీతా మంగళహారతులు గంగాహరణం (బిందెసేవ) ఆగమనిహిత కార్యక్రమం గ్రామం నందు బలిహరణాలు భగవంతుని తిరుమజ్జ నాధులు ఆరాధన, సహస్రనామ పూజ నిర్వహించారు. ఉత్సవ మూర్తులను పల్లకిలో ఉంచి


గరుడ వాహనంపై శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి


శివ లక్ష్మీ చెన్నకేశవ స్వామికి ప్రత్యేక అలంకరణ

గ్రామంలో ఊరేగించారు. మంగళహారతి, మంత్రపుష్పాల సమర్పణ అనంతరం భక్తులకు తీర్థ ప్రసాదములు పంపిణీ చేశారు. ధ్వజారోహణ కార్యక్రమం అనంతరం స్వామివారికి ప్రత్యేక పూజలు అభిషేక అర్చనలు నిర్వహించారు. రాత్రి స్వామివారిని ప్రత్యేకంగా అలంకరించి గరుడోత్సవం వాహనంలో ఉంచి ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి అనంతరం స్వామివారి ఆలయం వద్ద నుండి చిన్న రథంపై కెనరా బ్యాండ్, పాత పోలీస్ స్టేషన్ సర్కిల్. లాలాల వీధి. వైశ్య విధి. కోట వీధి.పెద్దమ్మతల్లి ఆలయం మీదుగా స్వామి వారి ఆలయానికి ఊరేగించారు. ఈ కార్యక్రమంలో అర్చకులు పెద్ద ఎత్తున భక్తులు పాల్గొన్నారు.



గరుడ వాహనంపై శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి ఊరేగింపు. భక్తుల సందడి


విజేతలకు బహుమతి ప్రధానం చేస్తున్న టిడిపి సీనియర్ నాయకుడు రూపులేని రాజశేఖర్

# డాన్స్ పోటీల విజేత శ్రీ విద్య గ్రూప్

**యాడికి (తెలుగోడు), మార్చి 1 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ శివలక్ష్మి చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆదివారం జెసి ఫ్యామిలీ గ్రామ పెద్దలు, భక్తాదులు ఆధ్వర్యంలో ఆలయం ప్రాంగణం నందు డాన్స్ పోటీలు ఘనంగా నిర్వహించడం జరిగినది. ఈ పోటీల యందు విజేతగా రాయల చెరువుకు చెందిన శ్రీ విద్య గ్రూప్ (శ్రీవిద్య స్కూల్ )కి మొదటి బహుమతి ని దాతలు నాయుడు 10 వేల రూపాయలు మొదటి బహుమతిగా అందజేయడం జరిగినది అలాగే వీరికి స్టార్ పారడైజ్ యాజమాన్యం విన్నర్ కప్ ను అందించారు . రెండవ బహుమతి విజేత గా నిలిచిన సాయి అంకిత (విజన్ స్కూల్ ) గ్రూప్ కి టిడిపి సీనియర్ నాయకులు రూపునేని రాజ శేఖర్ నాయుడు 5000 రూపాయలు రెండవ బహుమతి అందజేయడం జరిగినది. వీరికి స్టార్ పారడైజ్ యాజమాన్యం రన్నర్ కప్ అందించారు. మూడో బహుమతి విజేతగా నిలిచిన శ్రావ్య గ్రూప్ (వాగ్దేవి స్కూల్ )కు మూడో బహుమతి దాత లు జనసేన నాయకులు కేశవ 2500/- రూపాయలు అందజేయడం జరిగినది. బహుమతులు అందించిన దాతలకు ఆలయ కమిటీ సభ్యులు శాలువా మెమెంటో తో సత్కరించారు. న్యాయ నిర్ణేతలు డాన్స్ మాస్టర్ రమ్యకృష్ణ గారిని జనసేన ఉపాధ్యక్షులు జాకిర్ సన్మానించి ప్రత్యేక బహుమతి అందించారు.ఎంతో విన్నూత్నంగా పిల్లలను ప్రోత్సాహస్తూ ఈ కార్యక్రమం నిర్వహించడం చాలా శుభపరిణామం అని గ్రామ ప్రజలు కొనియాడారు..

# సిఎం చెప్తే రాజీనామా

**(మొదటి పేజి (తరువాయి))**

కరుణాకర్ రెడ్డిని ఉద్దేశించి వ్యాఖ్యానించారు. టీటీడీ ఎవరి వ్యక్తిగత సొత్తుకాదని ఘాటుగా విమర్శించారు. తనను ఎందుకు లక్ష్యంగా చేసుకున్నారో తెలుసు కోవడానికి పరిశీలన చేశానని, కొన్ని దుర్మార్గాలు బయటకు వస్తున్నాయని బీఆర్ నాయుడు అన్నారు. అవి పూర్తిగా బయటపడితే తిరుపతి ప్రజలే స్పందిస్తారని వ్యాఖ్యానించారు. టీటీడీ ఛైర్మన్‌గా నిస్వార్థంగా, ఏ ఆశలూ లేకుండా సేవ చేస్తున్నానని తెలిపారు. ఓ మీడియా అధినేతగా, వ్యాపారవేత్తగా అనేక అవకాశాలు ఉన్నప్పటికీ వాటిని వదిలి ఈ పదవికి రావాలని స్వయంగా ముఖ్యమంత్రిని కోరినట్లు చెప్పారు. టీటీడీలో గత అయిదేళ్లలో జరిగిన అక్రమాలను బయటపెడితే తిరుమల పవిత్రతకు భంగం కలుగుతుందని ముఖ్యమంత్రి వద్దన్నారని పేర్కొన్నారు. అయినప్పటికీ తనపై ఆరోపణలు చేస్తే మౌనం వహించబోనని స్పష్టం చేశారు. “తగ్గేదే లేదు” అంటూ హెచ్చరిక జారీ చేశారు.
వైరల్ వీడియోలో కనిపిస్తున్న కుటుంబంతో తనకు మూడు దశాబ్దాలుగా పరిచయం ఉందని, వారి ఇళ్లకు తాము వెళ్తామని, వారు తమ ఇంటికి వస్తుంటారని చెప్పారు. అంతమాత్రానా దుష్ప్రచారం చేయడం సరికాదని మండిపడ్డారు. కొన్ని భాగాలు మార్ఫింగ్ చేశారని, దాన్ని చేసినవాళ్లు సరిగా కూడా చేయలేదని ఎద్దేవా చేశారు. ఎన్నిసార్లు చూసినా వీడియోలో తప్పు కనిపించలేదని స్పష్టం చేశారు. ఈ అంశంపై ఇప్పటికే సైబర్ క్రైమ్ విభాగంలో ఫిర్యాదు చేశానని, దర్యాప్తులో నిజాలు బయటపడతాయని తెలిపారు. ఎవరైనా భయపెడితే భయపడే వాడిని కాదని, రాజీనామా చేయమంటే చేసే వాడినీ కాదని అన్నారు. సతీసమేతంగా జగన్ పట్టువస్త్రాలు ఎందుకు సమర్పించట్లేదని ప్రశ్నించడంతోనే తనపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. టీటీడీ ప్రతిష్టను కాపాడటం తన బాధ్యత అని, దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ దిగజారనివ్వనని బీఆర్ నాయుడు తేల్చిచెప్పారు.

# అంగన్‌వాడీల సంక్షేమానికి కట్టుబడి వున్నాం

**(మొదటి పేజి (తరువాయి))**

వెంటనే అంగన్వాడీ కేంద్రాల్లో మౌలిక సదుపాయాలపై ప్రత్యేక దృష్టి సారించామని గుర్తుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసినట్లు తెలిపారు. ఒక్కో కేంద్రానికి ప్రత్యేక నిధులు కేటాయించినట్టు చెప్పారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు అందేలా చర్యలు తీసుకున్నామని, తద్వారా జీతాల ఆలస్యానికి శాశ్వతంగా చెక్ పెట్టామని వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్ ఫోన్లు అందించినట్టు తెలిపారు. ఈ ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని చెప్పారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమని అభివర్ణించారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురు చూసిన గ్రాట్యుటీ కలను కూటమి ప్రభుత్వం నిజం చేసిందని పేర్కొన్నారు. గ్రాట్యుటీ చెల్లింపుల కోసం 2025 ఆంధ్రప్రదేశ్ బడ్జెట్‌లో రూ.20 కోట్లు కేటాయించినట్లు తెలిపారు. తాము అధికారంలోకి వచ్చిన తొమ్మిది నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచామని చెప్పారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీలను పూర్తి స్థాయి కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తున్నామని, మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి పూర్తి స్థాయి వేతనాలు అందజేస్తామని హామీ ఇచ్చారు. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనున్నట్లు వెల్లడించారు. అంగన్వాడీలు ప్రతిపాదించిన డిమాండ్లలో తొమ్మిదింటిని ఇప్పటికే పరిష్కరించామని, వేతనాల పెంపు అంశాన్ని కూడా వీలైనంత త్వరగా అమలు చేసే దిశగా కృషి కొనసాగుతోందన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితి క్లిష్టంగా ఉన్నప్పటికీ ఉద్యోగుల సంక్షేమానికి ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని హామీ ఇచ్చారు. ప్రతి నెల ఒకటో తేదీనే వేతనాలు చెల్లిస్తూ ఉద్యోగులకు భరోసాగా నిలుస్తోందని తెలిపారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళా తీసి వెళ్లిందని విమర్శిస్తూ, వారు చేసిన అప్పులకు రాష్ట్రానికి వస్తున్న ఆదాయంతో పాటు మరిన్ని అప్పులు తెచ్చి వడ్డీలు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొందని హోం మంత్రి అనిత ఆవేదన వ్యక్తం చేశారు.

# ఆందోళన అవసరం లేదు

**(మొదటి పేజి (తరువాయి))**

చేసుకోవాలని మంత్రి సూచించారు. ముఖ్యంగా ఇరాన్, ఇజ్రాయెల్ ప్రాంతాల్లో ఉన్న భారతీయుల భద్రతపై కేంద్ర ప్రభుత్వం, విదేశాంగ శాఖ నిరంతరం పర్యవేక్షణ చేస్తున్నాయని తెలిపారు. సరైన సమాచారం తెలుసుకుంటూ ఎప్పటికప్పుడు ఇండియన్ ఎంబసీలతో సంప్రదింపులో ఉండాలని సూచించారు. గగనతలంలో నెలకొన్న ప్రస్తుత పరిస్థితుల కారణంగా విమానాల రవాణాలో ఆలస్యం జరుగుతోందని, అయితే త్వరలోనే విమానయాన సేవలు పునరుద్ధరించబడతాయని మంత్రి పేర్కొన్నారు. పరిస్థితులు పూర్తిగా సాధారణ స్థితికి వచ్చే వరకు ఉద్రిక్తతలు ఉన్న ప్రాంతాలకు దూరంగా ఉండేందుకు రాష్ట్ర పౌరులు జాగ్రత్తలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షిస్తూ అవసరమైన ఆదేశాలు జారీ చేస్తున్నారని తెలిపారు. ఆయన సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం విదేశాంగ శాఖతో నిరంతర సంప్రదింపులు కొనసాగిస్తోందని చెప్పారు. ప్రభావిత దేశాల్లో ఉన్న ప్రతి రాష్ట్ర పౌరుని భద్రతను కాపాడేందుకు ప్రభుత్వం అన్ని విధాలుగా చర్యలు తీసుకుంటోందని మంత్రి స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో ఏపీ ఎన్నార్టీ హెల్ప్ లైన్ నెంబర్లు 091 8500027678, 091 0863 2340678లను సంప్రదించాలని, మరింత సమాచారం కోసం https://apnrts.ap.gov.in/ వెబ్‌సైట్‌ను వినియోగించాలని మంత్రి విజ్ఞప్తి చేశారు. ఎటువంటి తప్పుడు ప్రచారాన్ని నమ్మకుండా, స్థానిక అధికారులు మరియు అధికారిక మీడియా ప్రకటనల ద్వారా అందే సమాచారాన్నే అనుసరించాలని గల్ఫ్ దేశాల్లో ఉన్న రాష్ట్ర పౌరులను మంత్రి కోరారు.

# అంగన్వాడీలకు న్యాయం చేసింది.. చేసేది చంద్రబాబే

## ఎమ్మెల్యే పరిటాల సునీత

**కనగానపల్లె, (తెలుగోడు), మార్చి 1 :**
అంగన్వాడీలకు మొదటి నుంచి న్యాయం చేసింది.. చేసేది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మాత్రమేనని రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత అన్నారు. కనగానపల్లి మండలం నెమలివరం, పాతపాళ్యం గ్రామాల్లో ఆమె ఆదివారం పర్యటించారు. పలువురు నేతల ఇంట జరిగిన శుభకార్యాలలో ఆమె పాల్గొన్నారు. అనంతరం నిర్మాణంలో ఉన్న సీసీ రోడ్లను పరిశీలించారు. అలాగే ఇంకా నిర్మించాల్సిన రోడ్డు మార్గాల గురించి గ్రామస్థులు, టీడీపీ నాయకులతో చర్చించారు. అనంతరం అంగన్వాడీల సమస్యల గురించి స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిటాల సునీత ప్రత్యేకంగా ప్రస్తావించారు. అంగన్వాడీ కార్యకర్తలు, హెల్పర్లు సమస్యలపై కూటమి ప్రభుత్వం సానుకూలంగా ఉందన్నారు. వారు ఇప్పటికే తన దృష్టికి అనేక సమస్యలు తీసుకొచ్చారన్నారు.

# మహిళల భద్రత..అందరి బాధ్యత



**(మొదటి పేజి (తరువాయి))**

మహిళా వారోత్సవాలలో భాగంగా ఈ సైకిల్ ర్యాలీ నిర్వహించడం వెనుక ప్రత్యేక ఉద్దేశం ఉందన్నారు. సైకిల్ తొక్కడం వల్ల శారీరక దృఢత్వం, మానసిక ప్రశాంతత లభిస్తాయని చెప్పారు. సైకిల్ అందుబాటులోకి రావడంతో ఎంతోమంది ఆడపిల్లలు స్వేచ్ఛగా పాఠశాలలకు వెళ్లి చదువుకునే అవకాశం పొందారని గుర్తు చేశారు. ఒక కుటుంబం లేదా వ్యక్తి ఉన్నత స్థాయికి ఎదగడంలో మహిళల పాత్ర వెన్నెముక వంటిదని కొనియాడారు. ఎస్పీ సతీష్ కుమార్ మాట్లాడుతూ మహిళలకు రక్షణ కల్పించడం కేవలం ప్రభుత్వాలు లేదా పోలీస్ వ్యవస్థ బాధ్యత మాత్రమే కాదని, సమాజంలో ప్రతి ఒక్కరూ మహిళల భద్రతను తమ బాధ్యతగా భావించాలన్నారు. మహిళా సాధికారతతోనే సమాజ అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు. మార్చి 8 మహిళా దినోత్సవం సందర్భంగా ‘గివ్ టు గెయిన్’ అనే భావనతో కార్యక్రమాలు చేపడుతున్నామని తెలిపారు. సమాజం మహిళలకు ఇచ్చే గౌరవం, అవకాశాలు తిరిగి సమాజానికే మేలు చేస్తాయని చెప్పారు. ఒక తండ్రి తన కుమార్తెకు విద్య అందిస్తే ఆ కుటుంబం ఉన్నత స్థానానికి చేరుకుంటుందని వివరించారు. మహిళలకు శిక్షణ, భద్రతపై అవగాహన కల్పిస్తే వారు మరెందరికో మార్గదర్శకులవుతారని అన్నారు. మహిళలపై నేరాలను అరికట్టడంలో పోలీస్ శాఖ కట్టుబడి ఉందని స్పష్టం చేశారు. అదనపు ఎస్పీ అంకిత సురాన మాట్లాడుతూ కుటుంబ స్థాయి నుంచే బాలికలకు సమాన హక్కులు, అవకాశాలు కల్పించాలని పిలుపునిచ్చారు. మహిళలకు గౌరవం ఇవ్వడం ప్రతి ఒక్కరి బాధ్యత అని చెప్పారు. ఆర్డీవో సువర్ణ, ఐసీడీఎస్ పీడీ ప్రమీల మహిళలు భయపడకుండా ముందుకు రావాలని, సమస్యలు ఎదురైతే ధైర్యంగా స్పందించాలని సూచించారు. మహిళా పోలీస్ సిబ్బంది, శక్తి బృందాలు ర్యాలీలో పాల్గొని మహిళల రక్షణకు సంబంధించిన చట్టపరమైన అంశాలు, అత్యవసర పరిస్థితుల్లో స్పందించే విధానాలపై అవగాహన కల్పించారు. వారం రోజులపాటు మహిళల భద్రత, సాధికారతపై వివిధ కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

# కూటమి ప్రభుత్వం మెడలు వంచుదాం

## వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి .. కడపలో ‘రాయలసీమ లిఫ్ట్’పై భవిష్యత్ కార్యాచరణ సమావేశం

**కడప, (తెలుగోడు), మార్చి 1 :**
రాయలసీమ హక్కులు, ప్రయోజనాలను కాపాడుకునేందుకు కూటమి ప్రభుత్వం మెడలు వంచేలా పెద్ద ఎత్తున ఉద్యమించాల్సిన ఆవశ్యకత ఉందని వైఎస్ఆర్‌సీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి తెలిపారు. రాయలసీమతో పాటు నెల్లూరు, ప్రకాశం జిల్లాలకు రాయలసీమ ఎత్తిపోతల పథకం ఓ వరమని అన్నారు. నీటి కోసం ఇప్పుడు పోరాడకపోతే భవిష్యత్ తరాలు తీవ్రంగా నష్టపోతాయని తెలిపారు. రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలన్న డిమాండ్‌తో ఆదివారం కడపలోని మేడా కన్వెన్షన్ హాల్‌లో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో కీలక సమావేశం నిర్వహించారు. వైసీపీ రాష్ట్ర కో ఆర్డినేటర్ సజ్జల రామకృష్ణారెడ్డి, రీజనల్ కో ఆర్డినేటర్ పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డితో పాటు రాయలసీమ, నెల్లూరు, ప్రకాశం జిల్లాల అధ్యక్షులు, వైసీపీ సమన్వయకర్తలు, నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్ట్‌ను ప్రజా ఉద్యమంగా మార్చాలని సమావేశంలో నిర్ణయించారు. ఈ ప్రాజెక్ట్‌కు సంబంధించి భవిష్యత్ కార్యాచరణ, ఉద్యమ రూపకల్పనపై చర్చించారు. కృష్ణా జలాల పరివాహక ప్రాంతానికి చంద్రబాబు చేస్తున్న ద్రోహాన్ని కలిసికట్టుగా తిప్పికొడదామని నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా వైసీపీ అనంతపురం జిల్లా అధ్యక్షులు అనంత వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ రాయలసీమ ప్రాంతం దశాబ్ధాలుగా సాగు, తాగునీటి కష్టాలు ఎదుర్కొంటోందన్నారు. ఇక్కడ వలసలు, రైతుల ఆత్మహత్యలు ఆపడం కోసం ఎంతో మంది పోరాటాలు చేశారని గుర్తు చేశారు. దాని ఫలితంగానే నాగార్జున సాగర్, శ్రీశైలం, ఎస్ఆర్‌బీసీ, తెలుగు గంగ, హెచ్ఎన్ఎస్ఎస్, జీఎన్ఎస్ఎస్ వంటి ప్రాజెక్టులు వచ్చాయని తెలిపారు. కర్ణాటక, మహారాష్ట్ర, తెలంగాణ ప్రభుత్వాలు అక్రమంగా ప్రాజెక్టులు కడుతున్నా రాష్ట్ర ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యాం ఎత్తును పెంచి 129 టీఎంసీల సామర్థ్యాన్ని ఏకంగా 229 టీఎంసీలకు పెంచుతున్నా ముఖ్యమంత్రి చంద్రబాబు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. రాష్ట్ర విభజన తర్వాత తెలంగాణ ప్రభుత్వం శ్రీశైలం నుంచి రోజుకు 8 టీఎంసీలు తీసుకెళ్తోందన్నారు. ఇలాంటి తరుణంలో పోరాడాల్సిన ప్రభుత్వం చూసీచూడనట్లు వ్యవహరిస్తోందని తెలిపారు. చంద్రబాబుకు రాష్ట్ర ప్రయోజనాల కన్నా వ్యక్తిగత, రాజకీయ ప్రయోజనాలే ఎక్కువయ్యాయని ఆరోపించారు. ఇలాంటి తరుణంలో ప్రజలే పోరాటాలు చేయాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని తెలిపారు. గతంలో వైఎస్ రాజశేఖరరెడ్డి పీసీపీ అధ్యక్షుడిగా ఉంటూనే పోరాటాలు చేసిన విషయాన్ని గుర్తు చేశారు. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దూరదృష్టితో రాయలసీమ ఎత్తిపోతల పథకానికి శ్రీకారం చుడితే చంద్రబాబు సీఎం అయ్యాక ఈ పథకానికి సమాధి కడుతున్నారని మండిపడ్డారు. శ్రీశైలం నుంచి రోజుకు 3 టీఎంసీలు చొప్పున తీసుకెళ్లేలా రాయలసీమ లిఫ్ట్‌ను రూపొందించినట్లు తెలిపారు. 2024 వరకు రాయలసీమ లిఫ్ట్ పనులు కొనసాగాయని, చంద్రబాబు సీఎం అయ్యాక పనులు ముందుకు సాగలేదన్నారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి చేయడంతో ఎన్జీటీ అనుమతి వచ్చిన తర్వాత పనులు చేస్తామని మంత్రి నిమ్మల రామానాయుడు శాసనమండలిలో ఇటీవల ప్రకటన చేశారన్నారు.




అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు, విద్యార్థులు

## అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా సైకిల్ ర్యాలీ

**గుత్తి (తెలుగోడు), మార్చి 1 :**
అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని గుత్తి సి.ఐ రామారావు, సిబ్బంది, వివిధ విద్యా సంస్థల విద్యార్థులతో కలిసి పట్టణంలో సైకిల్ ర్యాలీ నిర్వహించారు. మహిళల సాధికారత, భద్రత , సమాన హక్కులపై అవగాహన పెంపొందించేందుకు కార్యక్రమం చేపట్టారు. ర్యాలీ గుత్తి పోలీస్ స్టేషన్ ప్రాంగణం నుంచి ప్రారంభమై పట్టణంలోని ముఖ్య రహదారుల మీదుగా సాగింది. మహిళల గౌరవం, సమానత్వం, భద్రతపై నినాదాలు చేస్తూ పాల్గొన్నవారు ప్రజల్లో చైతన్యం కల్పించారు. ఈ సందర్భంగా సి.ఐ రామారావు మాట్లాడుతూ “మహిళలు సమాజానికి వెన్నెముకలాంటి వారు. వారి హక్కులను కాపాడటం ప్రతి ఒక్కరి బాధ్యత. మహిళలపై జరిగే అన్యాయాలకు వ్యతిరేకంగా మనమందరం ఒక్కటిగా నిలవాలి” అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు సురేష్ ,అమీర్ ఖాన్, పోలీస్ సిబ్బంది, పాఠశాల మరియు కళాశాల విద్యార్థులు, పట్టణ ప్రజలు ఉత్సాహంగా పాల్గొన్నారు.

## శ్రీ సీతారామ దేవాలయం ప్రతిష్ఠ మహోత్సవాలకు ఆహ్వానం

**కనేకల్ (తెలుగోడు), మార్చి 1 :**
కనేకల్ పట్టణంలోని తారక రామనగర్ లో నూతనంగా నిర్మిస్తున్న శ్రీ సీతారామ దేవాలయంలో శ్రీ మహాగణపతి, శ్రీ వేంకటేశ్వర, శ్రీ సీతారామ లక్ష్మణ హనుమ సమేత, నందీశ్వర రుద్ర, నవగ్రహ, ధ్వజ, శిఖర (కలశ) దేవతల విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలు మార్చి 6, 7, 8 తేదీలలో వైభవంగా నిర్వహించనున్నారు. ఈ కార్యక్రమానికి పట్టణంలోని అన్ని కుటుంబాలు హాజరుకావాలని కమిటీ సభ్యులు భక్తిశ్రద్ధలతో ఆహ్వానిస్తున్నారు. మార్చి 6వ తేదీ శుక్రవారం ఉదయం 6 గంటలకు వరుణ పూజ, మహాగణపతి పూజలతో కార్యక్రమాలు ప్రారంభమవుతాయి. అనంతరం యాగశాల ప్రవేశం, వివిధ మండల పూజలు, హోమాలు, ప్రత్యేక పూజలు నిర్వహించబడును.మార్చి 7వ తేదీ శనివారం రుద్ర హోమం, నవగ్రహ హోమం, లక్ష్మీ గణపతి హోమం తదితర విశేష హోమాలు నిర్వహించబడును.మార్చి 8వ తేదీ ఆదివారం తెల్లవారుజామున యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠాపన, ప్రతిష్ఠా హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలు నిర్వహించనున్నారు.మార్చి 5వ తేదీ సాయంత్రం 4 గంటలకు శ్రీ చిక్కణేశ్వర స్వామి గుడి నుండి ఉత్సవ విగ్రహాలు, మహిళలతో కలశాలతో భవ్య ఊరేగింపు నిర్వహించబడును. ఈ సందర్భంగా భక్తులు 116 కలశములతో పాల్గొనవలసిందిగా దేవాలయ కమిటీ విజ్ఞప్తి చేసారు .మూడు రోజుల పాటు భక్తులకు అన్నప్రసాద వసతి కల్పించబడును. వేద పండితుల ఆధ్వర్యంలో దేవాలయ కమిటీ వారు ఈ కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు. భక్తులు కుటుంబ సమేతంగా విచ్చేసి ప్రతిష్ఠా మహోత్సవాలను విజయవంతం చేయగలరని ఆలయ కమిటీ వారు కోరారు.



ప్రారంభోత్సవానికి సిద్ధమయిన రామాలయం

## అనాథలకు ఆర్థిక సాయం

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 1 :**
అనంతపురంలో తల్లి లేదా తండ్రి లేని పిల్లలకు 40వ డివిజన్ కార్పొరేటర్ నలబోలు శ్రీలక్ష్మి టిడిపి నాయకులు డాక్టర్ నలబోలు మధు రాయల్ ఆధ్వర్యంలో ఒక్కొక్కరికి 10000 చొప్పున ఆర్థిక సహాయం అందించారు. 40 వ డివిజన్ కార్పొరేటర్ నలబోలు శ్రీలక్ష్మి టిడిపి నాయకులు డాక్టర్ నలబోలు మధు రాయల్ గార్ల కుమార్తె డాక్టర్ సాయి దీక్షిత పుట్టినరోజు సందర్భంగా ఆజాద్ నగర్‌లో ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు .తల్లి లేదా తండ్రి లేని 56 మంది చిన్నారులకు ఒక్కొక్కరికి పదివేల చొప్పున ఆర్థిక సహాయం అందించారు.

# దేవాదాయం..పరాధీనం..!

### దేవుడి భూముల్లో దెయ్యాల పాగా.. కర్పూరంలా కరిగిపోతున్న దేవుని భూములు.. చెవికెక్కించుకోని రెవెన్యూ శాఖ.. 57 మంది చేతిలో 152.78 ఎకరాల భూములు..

**యాడికి (తెలుగోడు), మార్చి 1 :**
ఎవరికైనా కష్టమొస్తే ఆ కష్టాలను తీర్చమని, చల్లగా చూడమని ఆ దేవుడి దగ్గరికి వెళ్లి చెప్పుకుంటాం. అలాంటిది ఆ దేవుడికే కష్టమొస్తే ఆయన ఎవరికి చెప్పుకోవాలి. ముమ్మాటికీ ఇది నిజం. అందరినీ కాపాడే ఆ దేవుడు తన భూములను కాపాడుకోలేకపోతున్నాడు. ఆ దేవదేవుడి ఆలనా పాలనా చూసేందుకు దాతలు సహృదయంతో వందల ఎకరాలను ఇచ్చి తమ ఔదర్యాన్ని చాటుకున్నారు. ధూపదీపాలకు ఎలాంటి లోటు రాకుండా ఉండాలని సంకల్పించారు. వీటి పర్యవేక్షణను సమర్థవంతంగా నిర్వహించాల్సిన అధికారగణం కళ్లు మూసుకొని పనిచేస్తుండటంతో దేవుడి భూముల్లో దెయ్యాలు పాగా వేస్తున్నాయి. పేదోడికి గూడు కల్పించడానికి సెంటు స్థలం ఇవ్వాలంటేనే కార్యాలయాల చుట్టూ కాళ్లరిగేలా తిప్పుకునే అధికారులు వందల ఎకరాల ఆలయ భూములను ఆక్రమణదారులకు అప్పనంగా అప్పగించేశారు. 333.15 ఎకరాల ఆలయానికి కౌలు ద్వారా వస్తున్న ఆదాయం కేవలం రూ.45 వేలు అంటే పర్యవేక్షణ ఏ స్థాయిలో ఉందో ఇట్టే అర్థం చేసుకోవచ్చు. రెవెన్యూ, దేవదాయ శాఖల సమన్వయ లేమి ఆక్రమణలకు ఆజ్యం పోస్తోంది. కర్పూరంలా కరిగిపోతున్న ఆలయ భూములతో దేవాదాయం పరాధీనమవుతుండటంతో ప్రతీ ఏటా బ్రహ్మోత్సవాలకు భక్తుల చందాల మీద ఆధారపడాల్సి వస్తోంది.

***దేవుడు 'సిరి' గలవాడే..!***

స్థానిక లక్ష్మీ చెన్నకేశవస్వామి స్థిర, చరాస్థుల్లో సిరి గలవాడే. ఆలయానికి ఉన్న 339.15 ఎకరాల భూమిని ఎకరం రూ.5 వేలు కౌలుకిచ్చినా ఏడాదికి రూ. 16 లక్షలు ఆదాయం వస్తుంది. ఇక ఆయన ఖాతాలో 60 తులాల బంగారు, 18.6 కిలోల వెండి ఉంది. ఆయల వాణిజ్య గదుల సముదాయం ద్వారా ఏడాదికి దాదాపు రూ. 12 లక్షలు వస్తోంది. ఆ దేవుడు ఇంత ధనవంతుడైనా ప్రతి ఏటా ఉత్సవాల నిర్వహణకు రూ.20 లక్షలకు పైగా చందాలు వసూలు చేయాల్సి వస్తోంది. ఎందుకంటే ఆలయ భూములన్నీ అన్యాక్రాంతం కావడమే ప్రధాన కారణం. 339.15 ఎకరాల్లో దేవాదాయ శాఖ కమిషనర్ అనుమతితో 55.95 ఎకరాల



యాడికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయం

విక్రయించినట్లు, ఇళ్ల పట్టాలకు 16.42 ఎకరాలు ఇచ్చినట్లు. అర్చకుల ఆధీనంలో 13.72 ఎకరాలున్నట్లు, కౌలుకు 58.60 ఎకరాలు ఇవ్వగా రూ.45,300 లు సొమ్ము అందుతున్నట్లు దేవదాయ శాఖ అధికారులు చెబుతున్నారు. ఇక 41.68 ఎకరాలు బంజరు భూమిగా ఉందని, మరో 152.78 ఎకరాల ఆలయ భూమి 57 మంది చేతిలో బందీగా ఉందని అధికారిక గణాంకాలు చెబుతున్నాయి. వీటిని ఆక్రమణల చెర నుంచి విడిపించమని దేవదాయ శాఖ అధికారులు పదేళ్లుగా రెవెన్యూ అధికారుల చుట్టూ సామాన్య రైతుల్లా తిరుగుతున్నా వారు చెవికెక్కించుకోవడం లేదు. గతంలో ఈ 57 మందికి రెవెన్యూ అధికారులు పట్టాదారు పాసుపుస్తకాలు ఇచ్చేయడంతో యథేచ్ఛగా అనుభవించుకుంటున్నారు. వాటిని రద్దు చేసే దిశగా రెవెన్యూ శాఖ దృష్టి పెట్టడం లేదని దేవాదాయ శాఖ పదే పదే ఆరోపిస్తూ యాడికి రెవెన్యూ అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేస్తోంది.

***రెవెన్యూ దయ.. దేవాదాయ ప్రాప్తం..!***

అన్యాక్రాంతమైన ఆలయ భూములను కాపాడాలని, అక్రమ పాసు పుస్తకాలను రద్దు చేయాలని ఏళ్లుగా దేవాదాయ శాఖ అధికారులు తహసీల్దార్, ఆర్డీవో స్థాయి అధికారులకు విన్నవిస్తూనే ఉన్నారు. 2016 నుంచి ఆ ప్రయత్నాలు మరింత గట్టిగా సాగుతున్నా రెవెన్యూ శాఖ స్పంచడం లేదనే విమర్శలున్నాయి. 2014-2019 మధ్య కాలంలో దేవదాయ శాఖ డిప్యూటీ కమిషనర్, సహాయ కమిషనర్, ఇన్స్పెక్టర్ స్థాయి అధికారులే గాక స్థానిక ఎండోమెంట్ అధికారులు కూడా పూర్తి వివరాలతో పట్టాల రద్దుకు వినతులు అందించారు. అప్పట్లో ఉత్సవాల సందర్భంగా గ్రామ పెద్దల సమక్షంలో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశాల సందర్భంలోనూ అప్పటి ఎమ్మెల్యే జేసీ ప్రభాకర్‌రెడ్డి దేవదాయ శాఖ అధికారులతో చర్చించి అన్యాక్రాంత భూములను వెనక్కు తీసుకునే ప్రయత్నం గట్టిగా చేయాలని సూచిం చారు. ప్రస్తుత ఉత్సవాల సందర్భంగా కూడా ఆయన ఆలయ భూముల అన్యాక్రాంతంపై మండి పడు తుండటం విశేషం. ఇప్పటికైనా అన్యాక్రాంత ఆలయ భూముల స్వాధీనం ఒకడుగైనా ముందుకు పడుతుందేమో చూడాలని, రెవెన్యూ దయ.. దేవాదాయ ప్రాప్తం అనే దీన స్థితి మారుతుందేమో చూడాలని స్థానికులు చర్చించుకుంటున్నారు.

పరాధీనంలో ఉన్న యాడికిలోని లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ భూములను స్వాధీనం చేసుకునే దిశగా చర్యలు తీసుకుంటున్నాం. అందులో భాగంగానే ఆలయ భూముల స్థానంలో హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేస్తున్నాం. ఇక నుంచి క్రయ విక్రయాలకు తావు లేకుండా చూస్తాం. అన్యాక్రాంతమైన ఆలయ భూములన్నింటి వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి, వాటికి మంజూరు చేసిన పట్టాదారు పాసుపుస్తకాల రద్దుకు కూడా ఉన్నతాధికారులకు నివేదిస్తాం.



ఇటీవల రెవెన్యూ అధికారులకు విన్నవిస్తున్న దేవాదాయ ఈవో సుబ్రహ్మణ్యం



ఆత్మహత్యకు పాల్పడిన కురవ సుబ్బన్న

## పెద్దొడ్డిలో వ్యక్తి ఆత్మహత్య

**గుత్తి (తెలుగోడు), మార్చి 1 :**
గుత్తి మండల పరిధిలోని పెద్దొడ్డి గ్రామానికి చెందిన కురుబ సుబ్బన్న (58) ఆదివారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు చీరతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. భార్య, కుమారుడు పనికి పోయి వచ్చి తలుపు తీయగా రాలేదు. చుట్టుపక్క ఉన్న ప్రజల సహాయంతో తలుపు పగలగొట్టి లోపలికి పోయి చూడగా ఫ్యాన్‌కు ఉరివేసుకొని కనిపించాడు. అప్పటికే చనిపోయి ఉండడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా రోధించారు. ఈ సంఘటనపై గుత్తి పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.



చెన్నకేశవస్వామి ఆలయంలో పట్టు వస్త్రాలు అందిస్తున్న చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు

## పట్టు వస్త్రాల ఊరేగింపు

### చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు..

**యాడికి (తెలుగోడు), మార్చి 1 :**
యాడికి మండల కేంద్రంలో వెలసిన శ్రీ లక్ష్మీ భూదేవి సమేత చెన్నకేశవ స్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా కళ్యాణోత్సవం కొరకు మార్కెట్లో ఉన్న చౌడేశ్వరి దేవస్థానం తరఫున పట్టు వస్త్రాలు తోగట వీర క్షత్రియ పెద్ద గుంపు వారి ఆధ్వర్యంలో స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించడం జరిగింది పట్టు వస్త్రాలను చౌడేశ్వరి ఆలయ కమిటీ సభ్యులు ఊరేగింపుతో చౌడేశ్వరి ఆలయం వద్ద నుండి పట్టు వస్త్రాలు తీసుకొని గుంపులుగా దాదాపుగా 200 మంది పైగా భాజా భజంత్రీలతో మేళ తాళాలతో చెన్నకేశవ స్వామి ఆలయంలో ప్రధాన అర్చకులు హరికృష్ణ శర్మ స్వామి నకు సమర్పించడం జరిగింది. అక్కడ ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు.



పట్టు వస్త్రాలు ఊరేగిస్తున్న వీర క్షత్రియులు

## పేద కుటుంబాలకు నిత్యవసరాలు పంపిణీ

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 1 :**
నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్, పుట్టినిల్లు ఆశ్రమం చైర్పర్సన్ డాక్టర్. ఎస్.నిర్మలమురళి , ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెంట్ డాక్టర్. మల్లీశ్వరి ఆధ్వర్యంలో పేద కుటుంబాలకు నిత్యవసర సరుకులు పంపిణీ చేశారు. అనంతపురం నగర శివారు ప్రాంతాల్లో ఉన్న ఎంపిక చేసిన 11 కుటుంబాల మహిళలకు ఆదివారం ఆదర్శనగర్‌లోని పుట్టినిల్లు ఆశ్రమంలో 26 రకాల నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా నిర్మలమురళి మాట్లాడుతూ ఒక పనిని నమ్ముకుని జీవనం సాగిస్తున్న వారి ఉపాధిని తొలగించటంతో వారి ఆర్థిక ఇబ్బందులు గమనించి ఇవాళ బాధ్యతగా సహాయ సహకారాలు అందించామన్నారు. ఈ కార్యక్రమానికి సహకారం అందించిన డాక్టర్. మల్లీశ్వరి కి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగినిగా పేదలకు సేవలు అందిస్తూనే బాధ్యతగా ట్రస్టు ద్వారా పేదలకు ఇవాళ సహకారం అందించినందుకు ధన్యవాదాలు తెలిపారు. డాక్టర్ మల్లీశ్వరి మాట్లాడుతూ నిత్యసురభి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలు అభినందనీయమని అన్నారు. నిర్మల గత కొంతకాలంగా సేవా కార్యక్రమాలు చేస్తూ పేదలకు అండగా నిలుస్తున్నారు. ట్రస్ట్ ఆధ్వర్యంలో మరింత మంది పేదలకు సహాయ సహకారాలు అందించడానికి దేవుడు వారి కుటుంబానికి ఆయురారోగ్యాలు ఇవ్వాలని కోరుకుంటున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు పాల్గొన్నారు.



పేద కుటుంబాలకు నిత్యావసరాలు అందిస్తున్న దృశ్యం



ఆజాద్ నగర్ అసేన్ మసీదులో ఇఫ్తార్ విందు ఇస్తున్న 40 డివిజన్ కార్పొరేటర్ నలుబోలు లక్ష్మీ భర్త డాక్టర్ నలుబోలు మధు

# యువతవల్లే దేశ అభివృద్ధి సాధ్యం

### జిల్లా బిజెపి అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్..

**కనేకల్ (తెలుగోడు), మార్చి 1 :**
దేశ అభివృద్ధి దేశ దశా, దిశా మారా లంటే యువత రాజకీయాలకు రావడం వల్లే సాధ్యమవుతుందని బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ అన్నారు. మండల బిజెపి ప్రధాన కార్యదర్శి కటార్ క్రాంతి కుమార్ యాదవ్ నూతన గృహప్రవేశానికి ఆదివారం ముఖ్య అతిథిగా రాజేష్ విచ్చేశారు. ఈ సందర్భంగా క్రాంతి కుమార్ కుటుంబ సభ్యులకు నూతన గృహ ప్రవేశం శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాజేష్ మాట్లాడుతూ బీజేపీ పార్టీ ఉత్తర ప్రాంతంలోని రాష్ట్రాలలో నే కాక దక్షిణ ప్రాంత రాష్ట్రాలలో సైతం బలపడుతుందన్నారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ మూడుసార్లు ప్రధానమంత్రి అయిన తర్వాత భారత దేశ అభివృద్ధి దశాదిశాను మార్చారన్నారు వికసిత భారత్ కోసం నరేంద్ర మోడీ నిరంతరం అహర్నిశలు కృషి చేస్తున్నారన్నారు. నరేంద్ర మోడీకి భారతదేశంలోని యువత సహకారం ఎంతో ముఖ్యమన్నారు. రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం నరేంద్ర మోడీ సహకారంతో అద్భుతంగా పరిపాలన కొనసాగిస్తుందని కొనియాడారు. రాబోవు రోజుల్లో మండలాల్లో సైతం బిజెపి పార్టీ బలోపేతానికి అందరి సహాయ సహకారాలు అవసరమని పార్టీ నాయకులకు దిశా నిర్దేశం చేశారు. నాయకులందరూ దిగువ స్థాయి నుండి పార్టీ కోసం కష్టపడాలన్నారు. బిజెపి మండల అధ్యక్షుడు కురువ తిప్పేస్వామి ఆధ్వర్యంలో నాగేపల్లి గ్రామానికి చెందిన రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) యువకులు నరేంద్ర, ఉమాపతి,గోపాల్, మహేంద్ర లను జిల్లా బిజెపి అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్ పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు.ఈ కార్యక్రమంలో జిల్లా కిసాన్ మోర్చా అధ్యక్షుడు కడప దామోదర్ కనేకల్ బిజెపి మండల అధ్యక్షుడు కురబతిప్పేస్వామి స్టేట్ కౌన్సిల్ మెంబర్ శ్రీమతి జింక వసుంధర దేవి రాయదుర్గం అసెంబ్లీ కన్వీనర్ హీరోజీ రావు జిల్లా కార్యదర్శి కరణం నరేంద్ర రావు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు విజయ్ కుమార్ హీరో మండల అధ్యక్షుడు ఆంజనేయులు బొమ్మనహాల్ మండల అధ్యక్షుడు శ్రీనివాసులు కార్యకర్త తిప్పారా రెడ్డి బిజెపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.



విలేకరులతో మాట్లాడుతున్న బిజెపి జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్



క్రాంతి కుమార్ గృహప్రవేశం వేడుకల్లో పాల్గొన్న కొనకొండ్ల రాజేష్ , బిజెపి నాయకులు
పలువురికి కండువా కప్పి యువతను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా బిజెపి అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్

# గుత్తేదారుని ఆధిపత్యానికి గులాం!

### విద్యుత్ సమస్యలతో వినియోగదారులు సతమతం..

**యాడికి (తెలుగోడు), మార్చి 1 :**
యాడికి మండలంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ స్తంభాలు ప్రమాద ఘంటికలు మోగిస్తున్నాయి. వేలాడుతున్న విద్యుత్ తీగలు మృత్యుపాశాల్లా మారాయి. పంట పొలాల్లోని విద్యుత్తు స్తంభాలు సగం వరకు ఒరిగిపోయాయి. ఏ క్షణంలో ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో తెలియని పరిస్థితి. అయినా సంబంధిత శాఖ అధికారులకు చీమకుట్టినట్లయినా లేదు. ఇటీవల తిప్పారెడ్డిపల్లిలో పశుగ్రాసం తరలిస్తుండగా ట్రాక్టర్ పైన విద్యుత్తు తీగలు తాకడంతో పెద్ద ఎత్తున మంటలు చెలరేగిన విషయం విదితమే. ప్రాణాపాయం తప్పడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు. ఈ విద్యుత్తు లైను మార్పిడి పనులకు ఉన్నతాధికారులు అనుమతిచ్చినా గుత్తేదారు పనులుప్రారంభించకపోవడంతో ఇలాంటి ప్రమాదాలు తలెత్తుతున్నాయని గ్రామస్థులు వాపోతున్నారు.

ఇక నూతన వ్యవసాయ విద్యుత్తు సర్వీసు పనులైతే గాలికి వదిలేశారని రైతులు గగ్గోలు పెడుతున్నారు. పూర్వ గుత్తేదారు, ప్రస్తుత గుత్తేదారుల మధ్య ఆధిపత్య పోరో ఆదాయ పోరో తెలియదు కాని సర్వీసు, సామగ్రి మంజూరైనా కూడా పనుల పూర్తికి నెలల తరబడి ఎదురు చూడాల్సి వస్తోంది. నియంత్రికలు మంజూరైనా కార్యాలయం చుట్టూ ప్రదక్షిణ చేయాల్సి కోనుప్పలపాడు, విద్యుత్తు వస్తోంది. నిట్టూరు తదితర గ్రామాల్లో గుత్తేదారుల నిర్లక్ష్యంతో 408 పైగా సమస్యలు పరిష్కారానికి నోచుకోవడం లేదు. అధికారులు కూడా గుత్తేదారుల ఆధిపత్యానికి గులామంటూ అన్నదాతల సమస్యలను గాలికి వదిలేశారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. వ్యవసాయ విద్యుత్తు సర్వీసులకు దరఖాస్తు చేసుకొని 300 మందికి పైగా రైతులు ఎదురు చూస్తుండగా మంజూరైన రైతులేమో



తిప్పారెడ్డి పల్లి గ్రామ సమీపంలో విద్యుత్ స్తంభాల దుస్థితి

పనులు పూర్తికాక సతమతమవుతున్నారు. అధికార అండతో పూర్తి చేయాల్సిన పనులను గుత్తేదారులు పట్టించుకోక పోవడంతో రైతులు అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తుంటే అధికారులేమో గుత్తాదారుల ప్రాబల్యానికి జడిసి నోరెత్తడం లేదనే చర్చనడుస్తోంది. సంస్కరణల్లో భాగంగా సీఎండీ శివశంకర్ ప్రతి మంగళ, శుక్రవారాల్లో అధికారులు, సిబ్బందితో గ్రామాల్లో నిర్వహింపజేస్తున్న ‘కరెంటోల్ల జనం బాట’తో ఏ సమస్యలు పరిష్కారం కావడం లేదని, అదో ప్రహసనంగా మారిందని పలువురు రైతులు ఆరోపిస్తున్నారు. కరెంటు కష్టాలు కాసుల చుట్టే తిరుగుతున్నాయనే విమర్శలు లేకపోలేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు ఆగిపోయిన నూతన వ్యవసాయ సర్వీసులపైనా, విద్యుత్తు మరమ్మతుల పైనా దృష్టి సారించాలని రైతులతో పాటు సామాన్యులు కోరుతున్నారు, నగరూరు రోడ్డులో విద్యుత్తు స్తంభాలు సగం వరకు ఒరిగిపోయాయి. ఏ క్షణంలో ఎలాంటి ముప్పు వాటిల్లుతుందో తెలియని పరిస్థితి అధికారులు ఇప్పటికైనా చర్యలు తీసుకుంటారా అని రైతులు వాపోతున్నారు.



నగరూరు గ్రామ సమీపంలో రోడ్డు పక్కన విద్యుత్ పొలాలపై విద్యుత్ స్తంభాల దుస్థితి



శుభకార్యాలకు హాజరైన సింగల్ విండో అధ్యక్షులు గణేష్ , మాజీ కన్వీనర్ శివ రుద్రప్ప పంచాయతీ కన్వీనర్ బివిఎస్ నాగరాజు

## పలుశుభకార్యాల్లో పాల్గొన్న టిడిపి నేతలు

**అమరాపురం (తెలుగోడు), మార్చి 1 :**
మండల పరిధిలోని నాగవనహల్లి గ్రామంలో గురుసిద్దేశ్వర గృహప్రవేశ కార్యక్రమంల, వలస గ్రామంలో మరజ్జగారి రాజు తమ్ముడు నిర్గంటెర్ మంజు కూతురు నిచ్చితార్థ కార్యక్రమంలో సింగిల్ విండో ప్రెసిడెంట్ గణేష్ , మాజీ కన్వీనర్ శివరుద్రప్ప వలస కన్వీనర్ బివిఎస్. నాగరాజు చెరువు నీటి సంఘం అధ్యక్షులు తిప్పేస్వామి బూత్ కన్వీనర్ తిమ్మారెడ్డి రాజు నరసింహమూర్తి పాల్గొన్నారు.



శుభకార్యంలో పాల్గొన్న టిడిపి నేతలు

## నేటి నుంచి పదవ తరగతి గ్రాండ్ టెస్ట్

*తొమ్మిదవ తరగతి సమ్మేటివ్ అసెస్మెంట్. -2 పరీక్షలు ఎంఇఓ శ్రీధర్*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 1 :**
రొళ్ళ మండలంలోని అన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నేటి (సోమవారం )నుంచి జరగబోయే పదవ తరగతి గ్రాండ్ టెస్ట్, తొమ్మిదవ తరగతి సమ్మేటివ్ అసెస్మెంట్. -2 పరీక్షలు పకడ్బందీగా నిర్వహించి ఎటువంటి సమస్యలు రాకుండా చూడాలని ఎం ఇ ఓ శ్రీధర్ తెలిపారు. అదేవిధంగా ప్రతిరోజు పదవ తరగతి, తొమ్మిదవ తరగతి విద్యార్థులు ఆయా పరీక్షలకు టైం టేబుల్ ప్రకారం హాజరై పరీక్షలు రాసే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. పరీక్ష



ప్రశ్నాపత్రాలు పరీక్ష ఉన్న రోజు ఒక గంట ముందుగా మాత్రమే మండల విద్యాశాఖ కార్యాలయం నుంచి అందజేయడం జరుగుతుందన్నారు. వాటిని ప్రధానోపాధ్యాయులు జాగ్రత్తగా తీసుకువెళ్లి పరీక్షలు నిర్వహించాలి. అదేవిధంగా పరీక్షకు సంబంధించిన సమాధాన పత్రాలు కానీ ప్రశ్నలు కానీ వాట్సాప్ లేదా ఏదేని ఇతర సోషల్ మీడియా యాప్ల ద్వారా షేర్ చేసుకోవడం వంటి చర్యలు ఎట్టి పరిస్థితుల్లోనూ జరగకూడదన్నారు. 9వ తరగతి విద్యార్థులకు ముందుగానే సమ్మేటివ్ అసెస్మెంట్ -2 పరీక్షలను నిర్వహిస్తామన్నారు. పరీక్షలు ముగిసిన వెంటనే 9వ తరగతి విద్యార్థులకు పదవ తరగతికి సంబంధించిన సిలబస్ను బోధించాలి ప్రభుత్వం నిర్ణయించిన సిలబస్ను ముందుగానే పూర్తి చేయవలసి ఉంటుందన్నారు. పదవ తరగతి విద్యార్థులకు పరీక్షా సమయం మధ్యాహ్నం 1:30 నుంచి సాయంత్రం 4:45 నిమిషాల వరకు 9వ తరగతి విద్యార్థులకు పరీక్షా సమయం మధ్యాహ్నం 01:30 నిమిషాల నుంచి సాయంత్రం 4:30 నిమిషాల వరకు సమయసారిణి ఈ కింది విధంగా తేదీల వారీగా ఉంటుందన్నారు. 2న ఫస్ట్ లాంగ్వేజ్ (తెలుగు), 4న సెకండ్ లాంగ్వేజ్ (హిందీ), 5న ఆంగ్లం, 6న గణితం 7న భౌతిక శాస్త్రం, 9న జీవశాస్త్రం, 10న సాంఘీకశాస్త్రం పరీక్షలు ఉంటాయన్నారు. ఎటువంటి ఇబ్బందులు లేకుండా పరీక్షలను విజయవంతంగా నిర్వహించి పదవ తరగతి విద్యార్థులను పబ్లిక్ పరీక్షలకు సన్నద్ధం చేయాలని కోరారు.

# క్రీడలతో స్నేహబంధం, ఒత్తిడి నుంచి ఉపశమనం

### పోలీసులు - పాత్రికేయుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్..

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 1 :**
నిత్యం పని ఒత్తిళ్లతో బిజీగా గడిపే పోలీసులకు, పాత్రికేయులకు క్రీడలు మానసిక ప్రశాంతతను అందిస్తాయని బత్తలపల్లి ఎస్ఐ సోమశేఖర్ అన్నారు. ఆదివారం స్థానిక ఆర్డీటీ క్రీడా మైదానంలో పోలీసులు -- పాత్రికేయుల మధ్య స్నేహపూర్వక క్రికెట్ మ్యాచ్ నిర్వహించడం ద్వారా పరస్పర అవగాహన, స్నేహబంధం మరింత బలపడిందన్నారు. ఈ మ్యాచ్‌కు ముందు టాస్‌ను పాత్రికేయుల జట్టు కెప్టెన్ రాధాకృష్ణ, పోలీసుల జట్టు కెప్టెన్ సుదర్శన్నాయుడు ఎగురవేశారు. టాస్ గెలిచిన పోలీసుల జట్టు తొలుత బ్యాటింగ్ చేసి 12 ఓవర్లలో 10 వికెట్ల నష్టానికి 87 పరుగులు సాధించింది. అనంతరం లక్ష్య ఛేదనకు దిగిన పాత్రికేయుల జట్టు 12 ఓవర్లలో 8 వికెట్లు కోల్పోయి 57 పరుగులకే పరిమితమై ఓటమి పాలైంది. మ్యాచ్ అనంతరం ఎస్ఐ సోమశేఖర్ మాట్లాడుతూ, రోజువారీ విధి నిర్వహణలో ఎదురయ్యే ఒత్తిడిని క్రీడలు తగ్గిస్తాయని చెప్పారు. పోలీసులు, పాత్రికేయులు కలిసి సరదాగా క్రీడల్లో పాల్గొనడం వల్ల పరస్పర స్నేహం, సహకారం మరింత పెరుగుతుందన్నారు. క్రీడలను స్నేహపూర్వకంగా, క్రీడా స్ఫూర్తితో ఆడితే శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక ఉల్లాసం కూడా



ఇరుజట్ల క్రీడాకారులతో మాట్లాడుతున్న ఎస్సై సోమశేఖర్

లభిస్తుందన్నారు. ఈకార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే జిల్లా సహాయ కార్యదర్శి మదనాపు రామాంజనేయులు, డివిజన్ ప్రధాన కార్యదర్శి జాంపుల అజయ్ చౌదరి, డివిజన్ కమిటీ సభ్యులు సాకే శ్రీనివాసులు, కప్పల హరికృష్ణ, మదనాపు రాజశేఖర్, జాప్ నాయకులు మదనాపు కృపాకర్‌తో పాటు మండల పాత్రికేయులు, పోలీసు సిబ్బంది పాల్గొని మ్యాచ్‌ను ఉత్సాహంగా తిలకించారు.

# అరటితోటకు గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు



కాలిపోయిన అరటి తోట

*రూ.2 లక్షల నష్టం..*

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 1 :**
మండల పరిధిలోని మాల్యవంతం గ్రామానికి చెందిన వైఎస్సార్సీపీ నాయకుడు సింగమనేని వెంకటేష్ సాగు చేస్తున్న అరటి పంటకు ఆదివారం సాయంత్రం గుర్తుతెలియని వ్యక్తులు నిప్పు పెట్టడంతో దాదాపు మూడు ఎకరాల్లో అరటి చెట్లు పూర్తిగా దగ్ధమయ్యాయి. ఈ ఘటనలో సుమారు రూ.2 లక్షల వరకు నష్టం వాటిల్లినట్లు బాధిత రైతు తెలిపారు. సింగమనేని వెంకటేష్ తనకున్న ఐదు ఎకరాల పొలంలో ఆరు వేలకుపైగా అరటి మొక్కలను సాగు చేశారు. ఇందులో తొలి పంట కోత పూర్తవగా, రెండో పంట కోతకు సిద్ధంగా ఉంది. ఈ క్రమంలో ఆదివారం సాయంత్రం రైతు కుమారుడు పొలం వద్దకు వెళ్లగా మంటలు చెలరేగుతున్నట్లు గమనించి వెంటనే తండ్రికి సమాచారం అందించారు. గ్రామస్తుల సహకారంతో మంటలను ఆర్పేందుకు ప్రయత్నించగా, అప్పటికే మూడు ఎకరాల్లో సుమారు నాలుగు వేల అరటి మొక్కలు కాలిపోయాయి. చేతికందివచ్చిన అరటి గెలలు, టమోటా సాగుకు ఏర్పాటు చేసిన ల్యాటర్ కూడా దగ్ధమయ్యాయి. మంటలు బయట నుంచి కాకుండా పొలంలో నుంచే చెలరేగినట్లు గుర్తించామని, అందువల్ల ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు ఉద్దేశపూర్వకంగా నిప్పు పెట్టి ఉండవచ్చని రైతు అనుమానం వ్యక్తం చేశారు. సమాచారం అందుకున్న బత్తలపల్లి పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది సంఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించారు.

# అందరం కలిసి మన ధర్మాన్ని, సంస్కృతిని కాపాడుకోవాలి

### ఘనంగా సద్భావన సదస్సు..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 1 :**
హిందూ సమాజంలో కులాలకు అతీతంగా అందరం కలిసి మన ధర్మాన్ని సంస్కృతిని కాపాడుకోవాలని ఆర్.ఎస్.ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ నల్లప్ప సూచించారు. అమరాపురంలో సద్భావన సదస్సు ఆదివారం అయోధ్య భవన్‌లో ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో అన్ని సామాజిక వర్గాల నుండి 50 మంది హిందూ సమాజ పెద్దలు పాల్గొన్నారు. ప్రధాన వక్త ఆర్.ఎస్.ఎస్ విభాగ్ శారీరక్ ప్రముఖ్ నల్లప్ప మార్గ దర్శనం చేశారు. సమాజంలో నెలకొన్న అసమానతలను దూరంచేయడంలో మనమందరం కలిసి కృషి చేయాలన్నారు మన భారతదేశం ప్రపంచంలో కెల్లా గొప్పదని అన్ని రకాల వర్గాల వారిని గౌరవించి మన భారత దేశం కలుపుకొని పోయింది. ఈ దేశం యొక్క విలువలను కాపాడుతూ కలిసి జీవించాలని తెలిపారు. కుటుంబవిలువలను మన పిల్లలకు బోధిస్తూ పెద్దలు అదర్శంగా ఉండాలన్నారు ఈ కార్యక్రమంలో సద్భావన ప్రముఖ శ్రీనివాసులు, సహప్రముఖ్ లింగేష్,



సహపంక్తి భోజనం చేస్తున్న దృశ్యం

నాగభూషన్, రిటైర్డ్ ఆర్మీ నాగభూషణ్, చిత్తన్న, ఆర్.ఎస్.ఎస్. సంఘ కార్యకర్తలు , ప్రముఖ పెద్దలు కలిసి విజయవంతం చేశారు చివరిగా అందరు కలిసి సహపంక్తి భోజనం చేశారు



మాట్లాడుతున్న ఆర్.ఎస్.ఎస్. విభాగ్ శారీరక ప్రముఖ్ నల్లప్ప. సమావేశంలో పాల్గొన్న హిందూ సమాజ పెద్దలు

# బొలెరో బోల్తా.. 12 మందికి గాయాలు..

**అమరాపురం (తెలుగోడు), మార్చి 1 :**
మండల పరిధిలో పేలుబండ గ్రామం వద్ద తమదేపల్లి గ్రామం నుంచి రోళ్ళ మండలం హెచ్. టి. పల్లి లో జరిగే నామకరణానికి వెళుతున్న బొలోరో వాహనం అదుపుతప్పి బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న 12 మందికి స్వల్పంగా గాయాలు అయినాయి వెంటనే స్థానికులు 108 కు సమాచారం ఇవ్వడం తో గాయపడిన వారిని మడకశిర ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వైద్య సేవలు అందజేశారు. ఎవరికీ ఎలాంటి ప్రాణాపాయం లేదని బంధువులు తెలిపారు.



బోల్తాపడ్డ బొలెరో



మడకశిర ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మహిళలు

# ఇద్దరు మహిళాలు, చిన్నారులు అదృశ్యం

*కేసు నమోదు ..*

**రొళ్ల (తెలుగోడు), మార్చి 1 :**
మండలంలోని హెచ్ టి హళ్లి వడ్రహట్టి గ్రామంలో అల్లుడు వీరేష్ వేధింపులు తాళలేక గత నెల 27న రాత్రి రోహిణి, రచన ఇద్దరు మనవరాళ్లతో సహా సుబ్బమ్మ, ఆమె కూతురు లక్ష్మీ అదృశ్యమయ్యారు. గత నాలుగు రోజులుగా నలుగురి కోసం వారి కుటుంబ సభ్యులు బంధువులు, ఇతర ప్రాంతాల్లో వెదికినా ఆచూకి తెలియకపోవడంతో అదృశ్యమైన విషయం పై సుబ్బమ్మ పెద్ద కుమార్తె పార్వతి రొళ్ల పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేశారు.. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ గౌతమి తెలిపారు..



అదృశ్యమైన మహిళలు, చిన్నారులు

# కుంచిటిగ వక్కలిగ డైరెక్టర్‌గా ప్రసన్నకుమార్

**రొళ్ల (తెలుగోడు), మార్చి 1 :**
రొళ్ల మండలంలోని ఎం.రాయపురం పంచాయతీ కుంచిటిగా వక్కలిగ డైరెక్టర్గా ప్రసన్న కుమార్ ను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నట్లు ప్రసన్నకుమార్ తెలిపారు. ఆదివారం పంచాయతీ పరిధిలోని కుంచటిగా వక్కలిగా కులస్థులు కలిసి తనను ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారని తెలిపారు. తన ఎన్నికకు సహకరించిన కులస్తులకు డైరెక్టర్ ప్రసన్నకుమార్ ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఈకార్యక్రమంలో రామచంద్రప్ప, ఉగ్రేగౌడ్, రామక్రిష్ణ,తిప్పేస్వామి, సోమశేఖర్, చిరంజీవి, నారాయణప్ప, నాగేంద్రప్ప, రఘువీర్,గంగరాజు, నాగభూషణ,నరసేగౌడ్, నరసింహమూర్తి, యువరాజు, నటరాజ్, రంగనాధ్,సతీష్, రాజన్న, హనుమంతరాయప్ప, నాగేంద్ర,వేణుగోపాల్, శివారెడ్డి, శ్రీనివాస్, ఆది తదితరులు పాల్గొన్నారు.



సమావేశమైన వక్కలిగా కులస్థులు

# కర్నాటకలో రోడ్డు ప్రమాదం బత్తలపల్లి బీటెక్ విద్యార్థి దుర్మరణం

**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 1 :**
కర్నాటక రాజధాని బెంగుళూరులో శనివారం సాయంత్రం జరిగిన ఘోర రోడ్డు ప్రమాదంలో బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన బీటెక్ విద్యార్థి దుర్మరణం చెందాడు. ఈ ఘటనతో మండలంలో తీవ్ర విషాదం నెలకొంది. ఈదుల ముష్టూరు గ్రామానికి చెందిన మాజీ బీఎస్ఎఫ్ జవాన్ నరసింహులు కుమారుడు రఘువంశీ (21) బెంగుళూరులోని ఆలియన్స్ యూనివర్సిటీలో బీటెక్ ద్వితీయ సంవత్సరం చదువుతున్నాడు. శనివారం సాయంత్రం కళాశాల నుంచి ద్విచక్రవాహనంపై తన రూంకు తిరిగి వెళు న్న సమయంలో వెనుక నుంచి వచ్చిన టిప్పర్ వాహనం ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి అక్కడికక్కడే మృతి చెందినట్లు సమాచారం. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం పూర్తయ్యాక మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అనంతరం స్వగ్రామానికి తీసుకువచ్చి అంత్యక్రియలు నిర్వహించారు.



రఘువంశీ (ఫైల్ ఫోటో)

చేతికొచ్చిన కుమారుడు అకాలంగా మృతి చెందడంతో తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు గుండెలవిసేలా రోదించారు. రఘువంశీ మృతి వార్త గ్రామంలో తీవ్ర దిగ్భ్రాంతిని కలిగించగా, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి కుటుంబాన్ని పరామర్శించారు.

# గణపతి విగహం చోరీకి సహకరించిన వారు ఎంతటివారైనా తోలు తీయిస్తా..

### దొంగలను దేవుడు వదిలినా నేను వదలను.. వెంటనే పట్టుకోండి .. పోలీస్ సిబ్బందికి ఆదేశం.. ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు..

**అగళి (తెలుగోడు), మార్చి 1 :**
గణపతి విగ్రహాన్ని చోరీ చేసిన దొంగలను వారికి సహకరించిన వారిని కూడా తోలుతీయిస్తానని దేవుడు వదిలిపెట్టిన నేను మాత్రం వదలనని ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు పేర్కొన్నారు. అగళి మండల కేంద్రం నందు శ్రీ శంకరేశ్వర స్వామి దేవాలయంలో అతి పురాతనమైన చోళ రాజుల కాలంలో ప్రతిష్టాపించబడిన ఎంతో విలువైన దాదాపు 400 కేజీలు గల వినాయక విగ్రహాన్ని దొంగలించిన సంగతి తెలిసిందే. గత నాలుగు నెలల క్రితం ఈ దొంగతనానికి పాల్పడిన దుండగులను పట్టుకోవాలని గ్రామస్తులు అనేకమార్లు పోలీస్ సిబ్బందికి విన్నవించినా ఫలితం లేదన్నారు. మూడు రోజుల క్రితం డి.ఎస్.పి నరసింగప్ప అగళి పోలీస్ స్టేషన్ ఆవరణంలో గ్రామస్తుల సమక్షంలో గణపతి భక్తుల సమక్షంలో సమావేశాన్ని ఏర్పాటు చేసుకొని గణపతి దొంగలించిన వారిని ఎట్టి పరిస్థితుల్లో వదిలే ప్రసక్తే లేదని గ్రామ ప్రజలకు తెలియజేశారు గణపతి దొంగతనం జరిగిందని విషయం తెలుసుకున్న శాసనసభ్యులు ఎమ్మెల్యే ఎంఎస్ రాజు ఆదివారం అగళి మండల కేంద్రమునందుగల శంకరేశ్వర స్వామి ఆలయాన్ని సందర్శించి గ్రామ పెద్దలు గ్రామస్తుల గణపతి భక్తాదుల సమక్షంలో గణపతి విగ్రహం ఏ విధంగా



సీఐ రాజ్ కుమార్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెస్ రాజు



గ్రామ ప్రజలతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఎమ్మెల్సీ

దొంగలించారు ఎలా దొంగలించారని గ్రామస్తులతో అడిగి తెలుసుకున్నారు శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు పోలీస్ సిబ్బందికి స్థానిక మడకశిర రాజ్ కుమార్ కు గణపతి విగ్రహం దొంగలించిన వారిని వెంటనే పట్టుకోవాలని గట్టిగా ఆదేశిస్తూ దేవుని దొంగ నిచ్చిన వాడిని దేవుడు కూడా కాపాడలేడు అంటూ గ్రామస్తులు అధైర్య పడకండి దొంగలను పట్టే మార్గాలను వెతుకుదాం అని శాసనసభ్యులు ఎమ్మెస్ రాజ్ గ్రామస్తులకు తెలియజేశారు శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు సీఐ రాజకుమార్ కు మీ పోలీస్ సిబ్బందితో టీంలుగా ఏర్పడి గణపతి విగ్రహం ఆచూకీ తెలుసుకోవాలని గణపతి విగ్రహం దొంగతనం పాల్పడిన వాడు ఎవడైనా ఎంతటి వాడిన వదిలే ప్రసక్తే లేదు అని తెలియజేశారు సీఐ మాట్లాడుతూ ఇప్పటికే రెండు స్పెషల్ టీం లను ఏర్పాటు చేసి గాలింపు చర్యలు చేపడుతున్నామని తెలియజేశారు
గతంలో తరచుగా 10 సంవత్సరాలు క్రితం ఇలానే అనేకమార్లు శంకరేశ్వర స్వామి ఆలయంలో గుప్తనిధుల కోసం వచ్చిన వారిపై కేసులు కూడా నమోదు అయినాయి వారిని కూడా అదుపులో తీసుకొని దర్యాప్తు చేస్తామని తెలియజేశారు ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు ఎమ్మెస్ రాజు స్థానిక జడ్పిటిసి ఉమేష్ మాజీ రాష్ట్ర వక్కలీగా కార్పొరేషన్ చైర్మన్ వి ఎం పాండురంగప్ప,సింగల్ విండో అధ్యక్షులు కుమారస్వామి మండల కన్వీనర్ తిప్పేస్వామి, పార్లమెంట్ ఆర్గనైజ్ సెక్రెటరీ శ్రీనివాస్,స్థానిక సర్పంచ్ లక్ష్మమ్మ హనుమంత రాయప్ప మాజీ ఎంపీపీ బసవరాజ్,షౌకత్, తాలిఖాన్,మార్కెట్ యార్డ్ డైరెక్టర్లు కెంచుయాదవ్ శివరాములు, గౌడ షాన బోగులు గణపతి భక్తాదులు యువకులు,రైతులు గ్రామ పెద్దలు గ్రామ ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

# నేటి నుంచే శ్రీ కాటి కోటేశ్వరుని బ్రహ్మోత్సవాలు

### మురువైన గవికొండ - మురిసే ముష్టూరు ఐదు రోజుల పాటు కనులపండువగా గడినోములు,. 4న లంకాదహనం. 5న రథోత్సవం..


**బత్తలపల్లి (తెలుగోడు), మార్చి 1 :**
భక్తులకు కోరిన కోర్కెలు తీర్చే కొంగు బంగారంలా విరాజులతో దర్శనమిస్తున్న ఆధ్యాత్మిక నిలయం... బత్తలపల్లి మండలం ఈదుల ముష్టూరు గ్రామ సమీపంలోని శ్రీ కాటి కోటేశ్వర స్వామి (కాటమయ్య కొండ) బ్రహ్మోత్సవాలకు సర్వం సిద్ధమైంది. సుమారు 400 ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ క్షేత్రంలో మార్చి 2 నుంచి ఐదు రోజుల పాటు 'గడినోములు' అత్యంత వైభవంగా జరగనున్నాయి. ఉత్సవాలకు ఆలయ కమిటీ, గ్రామస్తులు విస్తృత ఏర్పాట్లు పూర్తి చేశారు.

***మునులు ఏలిన కొండ... మహిమల గవికొండ..***

ఈ క్షేత్రం సాక్షాత్తు పరమశివుని స్వరూపమని భక్తుల విశ్వాసం. గవికొండపై వెలసిన స్వామి వారి సన్నిధిలో అడుగు పెడితే మనశ్శాంతి లభిస్తుందని, కలలో కుక్క రూపంలో దర్శనమిచ్చి సమస్యలకు పరిష్కారం చూపుతారని భక్తుల నమ్మకం. కొండ పడమర దిశన ఉన్న హనుమప్ప దొనలోని నీరు ఎప్పుడూ నిండుగా, అత్యంత తీయగా ఉండటం ప్రత్యేక ఆకర్షణ. ఈ నీటిని పంటలపై, పశువులపై చల్లితే వ్యాధులు నయమవుతాయని భక్తులు విశ్వసిస్తారు.

***ఉత్సవాల విశేషాలు..***

ఈ క్షేత్రంలో తొలి రోజు వేద పండితులు పూజలు నిర్వహిస్తే, మిగిలిన రోజుల్లో బోయ (వాల్మీకులు) కులస్తులు పూజలు చేయడం ప్రత్యేకత. మార్చి 2 (సోమవారం): రెడ్డి వారి బోనాలు, బ్రాహ్మణ సంప్రోక్షణ, ధ్వజారోహణంతో ఉత్సవాల ప్రారంభం. మార్చి 3 (మంగళవారం): ఉదయం 8 గంటలకు జలది పూజ, గంగపూజ; రాత్రి 10 గంటలకు కొండకు ప్రభల పయనం. మార్చి 4 (బుధవారం): రాత్రి 10 గంటలకు ప్రభల ఊరేగింపు; రాత్రి 11.30 గంటలకు లంకాదహనం (కాముని దహనం). మార్చి 5 (గురువారం): పగలు రథోత్సవం (తేరు), పన్నేరు బండ్ల ప్రదక్షిణలు; రాత్రి ముష్టూరులో గ్రామోత్సవం. మార్చి 6 (శుక్రవారం): ఎర్రికొండా భక్తుని జీవగడ్డలో మారు పూజలతో ఉత్సవాల ముగింపు. ఈ క్షేత్రం వివాహాలకు కూడా ప్రసిద్ధి.



శ్రీ కాటి కోటేశ్వర స్వామి

తిరుమల తిరుపతి దేవస్థానాలు నిర్మించిన కళ్యాణ మండపంతో పాటు అన్ని వసతులు అందుబాటులో ఉండటంతో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఉత్సవాల సందర్భంగా వచ్చే వేలాది మంది భక్తుల కోసం తాగునీరు, నీడ, ప్రత్యేక రవాణా సౌకర్యాలను ఆలయ కమిటీ ఏర్పాటు చేసింది. మాఘ మాస దీక్షలు విరమించే భక్తులు కూడా ఈ ఉత్సవాలకు భారీగా తరలిరానున్నారని నిర్వాహకులు తెలిపారు.



సత్ప్రవర్తనతో మెలగాలని కౌన్సెలింగ్ ఇస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

## శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యం

*రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్.. ఎస్ఐ నిరంజన్ రెడ్డి ..*

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 1 :**
శాంతి భద్రతల పరిరక్షణే ప్రధాన లక్ష్యమని, ఇందు కోసం సహకరించాలని ఎస్ఐ నిరంజన్ రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం పెద్దకడబూరులోని పోలీస్ స్టేషన్ ఆవరణలో రౌడీషీటర్లకు ప్రత్యేక కౌన్సిలింగ్ నిర్వహించారు. సమాజంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడమే లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. ఈ సందర్భంగా రౌడీషీట్ కలిగిన వ్యక్తులకు సత్ప్రవర్తనతో మెలగాలని, చట్టాలను గౌరవించాలని, ఎలాంటి గొడవలు, దాడులు, బెదిరింపులు వంటి అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడకూడదని స్పష్టంగా సూచించారు. గ్రామాల్లో శాంతి భద్రతలకు భంగం కలిగించే చర్యలు చేపట్టిన పక్షంలో కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ప్రతి వ్యక్తి తన ప్రవర్తన ద్వారా కుటుంబానికి, సమాజానికి గౌరవం తీసుకురావాలని సూచించారు. గత తప్పిదాలను పునరావృతం చేయకుండా, ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకుని సక్రమ మార్గంలో జీవనం సాగించాలని ఎస్ఐ హితవు పలికారు. మండలంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ముందస్తు చర్యగా ఈ కౌన్సిలింగ్ కార్యక్రమం చేపట్టినట్లు తెలిపారు. ప్రజల సహకారంతో శాంతి భద్రతలను మరింత బలోపేతం చేస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



జాతీయ రహదారిపై వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఎస్ఐ నిరంజన్ రెడ్డి

## నిబంధనలు అతిక్రమించిన 17 మందికి జరిమానా

*లైసెన్స్ లేకుంటే వాహనం సీజ్ .. ఎస్ఐ నిరంజన్ రెడ్డి ..*

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 1 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని హనుమాపురం గ్రామ శివారుల్లో 167వ జాతీయ రహదారిపై ఆదివారం ఎస్ఐ నిరంజన్ రెడ్డి వాహనాల తనిఖీలు నిర్వహించారు. రోడ్డు ప్రమాదాల నివారణ మరియు ట్రాఫిక్ నియమాల అమలులో భాగంగా ఈ తనిఖీలు చేపట్టారు. హెల్మెట్ ధరించకుండా ద్విచక్ర వాహనాలు నడిపినవారు, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా ప్రయాణించినవారు, ట్రిపుల్ రైడింగ్ చేసినవారు సహా మొత్తం 17 మంది వాహనదారులను గుర్తించారు. నిబంధనలు ఉల్లంఘించినందుకు రూ.3,995 జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఎస్ఐ నిరంజన్ రెడ్డి వాహనదారులకు కౌన్సిలింగ్ నిర్వహించారు. రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని పేర్కొంటూ, హెల్మెట్ ధరించడం ప్రాణ రక్షణకు ఎంతో కీలకమని వివరించారు. డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తీసుకోవడంతో పాటు వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నియమాలను పాటించడం ద్వారా ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని, ప్రజలు బాధ్యతతో వ్యవహరించాలని ఆయన సూచించారు. రాబోయే రోజుల్లో కూడా ఇటువంటి తనిఖీలు కొనసాగుతాయని తెలిపారు.

## వీరశైవుల సామాజిక సంక్షేమాభివృద్ధే ధ్యేయం

*రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న. .*

**ఎమ్మిగనూరు (తెలుగోడు), మార్చి 1 :**
వీరశైవుల సామాజిక సంక్షేమాభివృద్ధే ధ్యేయం అని రాష్ట్ర వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న అన్నారు. కర్నూలు జిల్లా పర్యటనలో 'వీరశైవ లింగాయత్ కార్పోరేషన్ చైర్మన్ తుల్జాపూర్ స్వప్న ఎమ్మిగనూరు మండలం, కె. తిమ్మాపురం గ్రామంలో తాలుకా వీరశైవ లింగాయత్ సంక్షేమ సేవా సమితి' కమ్యూనిటీ వ్యవస్థాకాధ్యక్షులు బి సి నాగరాజు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు, ఈ కార్యక్రమంలో తాలుకా అధ్యక్షులు బి సి నాగరాజు, గ్రామ వీరశైవ కమ్యూనిటీ అధ్యక్షులు పెద్ద బసన్న, ప్రధాన కార్యదర్శి పెద్ద రామలింగప్ప మాట్లాడుతూ కె. తిమ్మాపురం గ్రామంలోని "శ్రీ బసవేశ్వర కళ్యాణ మండపం" నిర్మాణానికి తగిన ఆర్థిక, సహాయ, సహకారాలు అందించాలని కోరారు.

రాష్ట్ర ప్రభుత్వం వీరశైవులను బిసి "డి" క్యాటగిరీ కింద గుర్తించిప్పటికి కేంద్ర ప్రభుత్వం "ఓబీసీ" జాబితా లో చేర్చలేదని అన్నారు. వీరశైవులకు రాష్ట్ర రాజధాని అమరావతిలో శ్రీ బసవేశ్వర భవన్' ఏర్పాటు చేయాలని, ప్రముఖ శివాలయాల్లో, క్షేత్రాల్లో వీరశైవలకు నామినేషన్ పదవులు ఇవ్వాలని, ప్రత్యేక శ్మశాన వాటికలు, ప్రత్యేక వీరశైవ లింగాయత్ కాలనీలు, వీరశైవుల సాధికారతలో భాగంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. దీనికి స్పందించిన చైర్మన్ తుల్జాపూర్ స్వప్న తిమ్మాపురం వీరశైవ లింగాయత్‌ల "శ్రీ బసవేశ్వర కళ్యాణ మండపం" నిర్మాణానికి తగిన ఆర్థిక, సహాయ, సహకారాలు అందిస్తామన్నారు. డిమాండ్లను ప్రభుత్వ ఉన్నతాధికారుల, ప్రజా ప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ వీరశైవ లింగాయత్ కమ్యూనిటీ పెద్దలు, మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

# పెద్దకడబూరులో అగ్నిప్రమాదం

### గడ్డివామి దగ్ధం - రూ.30 వేల నష్టం

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 1 :**
పెద్దకడబూరు గ్రామంలో ఆదివారం మధ్యాహ్నం చోటుచేసుకున్న అగ్నిప్రమాదంలో రైతు కోటేకల్ రాజుకు చెందిన గడ్డివాము పూర్తిగా దగ్ధమైంది. ఈ ఘటనలో సుమారు రూ.30 వేల మేర ఆస్తి నష్టం సంభవించింది. గ్రామంలోని బీసీ హాస్టల్ సమీపంలో పలువురు రైతులు పశువుల మేత కోసం గడ్డివాములు నిల్వ ఉంచుకున్నారు. మధ్యాహ్న సమయంలో ప్రమాదవశాత్తు కోటేకల్ రాజుకు చెందిన గడ్డివాముకు నిప్పంటుకోవడంతో మంటలు ఒక్కసారిగా ఎగిసిపడ్డాయి. ఎండ తీవ్రత మరియు గాలి వేగం కారణంగా మంటలు వేగంగా వ్యాపించడంతో అక్కడి రైతులు, స్థానికులు ఆందోళనకు గురయ్యారు. సమాచారం అందుకున్న



రైతు కోటేకల్ రాజుకు చెందిన గడ్డివాము దగ్ధమైన దృశ్యం



మంటలు ఆర్పుతున్న ఏఎస్ఐ శివరాములు

వెంటనే ఎస్ఐ నిరంజన్ రెడ్డి, ఏఎస్ఐ శివరాములు సంఘటనా స్థలానికి చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. వారి ఆధ్వర్యంలో స్థానికులు తక్షణ చర్యలు చేపట్టి మంటలు పక్కనే ఉన్న ఇతర గడ్డివాములకు వ్యాపించకుండా అడ్డుకున్నారు. అనంతరం అగ్నిమాపక సిబ్బంది చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. అయితే అప్పటికే కోటేకల్ రాజుకు చెందిన గడ్డివాము పూర్తిగా కాలిపోయింది. పశువుల కోసం ఇటీవలే కొనుగోలు చేసి నిల్వ ఉంచుకున్న గడ్డివాము అగ్నికి ఆహుతి కావడంతో పశువులకు మేత లేకుండా పోయిందని రైతు కోటేకల్ రాజు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం కారణంగా తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని తెలిపారు. సంబంధిత అధికారులు స్పందించి తక్షణమే నష్టపరిహారం అందించి ఆదుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. గడ్డివాములు నిల్వ ఉంచే ప్రాంతాల్లో భద్రతా చర్యలు తీసుకోవాలని స్థానికులు సూచించారు.

# రైతు సంక్షేమానికి ప్రభుత్వం పెద్దపీట

### ధాన్యానికి మంచి ధర .. జిల్లాలో ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభం.. రైతులకు 24 గంటల్లోనే ధాన్యం డబ్బులు.. సంగంలో ధాన్యం కొనుగోలు కేందం ప్రారంభం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డ..

**సంగం (తెలుగోడు), మార్చి 1 :**
రైతులకు గిట్టుబాటు ధర కల్పించడం లక్ష్యంగా సంగం మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి రాష్ట్ర పౌరసరఫరాల సంస్థ డైరెక్టర్ వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డితో కలిసి ప్రారంభించారు. కేంద్రాన్ని ప్రారంభించిన అనంతరం మంత్రి అధికారులతో ఏర్పాట్లు, ధాన్యం సేకరణ విధానం, నగదు చెల్లింపుల ప్రక్రియపై సమగ్రంగా వివరాలు తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, పంట పండించిన ఏ ఒక్క రైతు కంట కన్నీరు రాకూడదనే సంకల్పంతో ప్రభుత్వం ఖచ్చితమైన నిర్ణయాలు తీసుకుంటోందన్నారు. వ్యవసాయ రంగానికి తమ ప్రభుత్వం అగ్రతాంబూలం వేస్తోందని, రైతులకు మద్దతు ధర అందించడమే



ధాన్యం కొనుగోల కేంద్రానికి విచ్చేసిన మంత్రి ఆనంకు స్వాగతం పలుకుతున్న మండలం కన్వీనర్ శ్రీనివాసల రెడ్డి



సంగంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న మంత్రి ఆనం

కాకుండా బహిరంగ మార్కెట్లో మద్దతు ధర కంటే ఎక్కువ ధర దక్కేలా ముందుగానే కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామని తెలిపారు. జిల్లాలో తొలి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సంగంలో ప్రారంభించడం ఆనందంగా ఉందన్నారు.

ధాన్యం కొనుగోలు చేసిన 24 గంటల్లోనే రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేసే విధంగా పారదర్శక వ్యవస్థ ఏర్పాటు చేశామని మంత్రి స్పష్టం చేశారు. గత ప్రభుత్వ కాలంలో రైతులు ఎదుర్కొన్న ఇబ్బందులు పునరావృతం కాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు వ్యవసాయ, పౌరసరఫరాల, మార్కెటింగ్ శాఖలు సమన్వయంతో పనిచేస్తున్నాయని తెలిపారు. జిల్లాలో ధాన్యం సేకరణకు అధికార యంత్రాంగం పూర్తిగా సిద్ధంగా ఉందని చెప్పారు. రైతులకు ఎటువంటి సమస్యలు ఎదురైనా ఒక్క ఫోన్ కాల్‌తోనే వెంటనే పరిష్కారం అందించే విధంగా వ్యవస్థ ఏర్పాటు చేశామని మంత్రి హామీ ఇచ్చారు. "ఇది రైతు పక్షపాత ప్రభుత్వం... ప్రతి విషయంలో రైతుల సంక్షేమానికే మా నిర్ణయాలు" అని మంత్రి ఆనం రామనారాయణరెడ్డి స్పష్టం చేశారు.

ఈ కార్యక్రమంలో జిల్లా సహకార శాఖ అధికారి గుర్రప్ప, పౌర సరఫరాల సంస్థ డిఎం అర్జున్ రావు, డి ఎస్ వో లీలారాణి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సత్యవాణి, మార్కెటింగ్ కమిటీ చైర్మన్ జనార్ధన్ నాయుడు, వివిధ శాఖల అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు మండల కన్వీనర్ శ్రీనివాసులు రెడ్డి. సంఘం సొసైటీ అధ్యక్షుడు శ్రీనివాసుల యాదవ్. పలుకురుపాడు సాగినీటి సంఘం అధ్యక్షులు బాబు. తెలుగుదేశం పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ముగ్గురిపై దాడి కేసు నమోదు

*ఎస్ఐ నిరంజన్ రెడ్డి*

**పెద్దకడబూరు (తెలుగోడు), మార్చి 1 :**
పెద్దకడబూరు మండల పరిధిలోని చిన్నతుంబళం గ్రామంలో ఇంటి స్థలం దారి విషయంలో తలెత్తిన వివాదం ఘర్షణకు దారితీసింది. గ్రామానికి చెందిన బోయ హనుమంతు, కడబూరి, హరికృష్ణలపై అదే గ్రామానికి చెందిన లింగన్న, మహదేవ, మహేష్‌లు దాడి చేసి గాయపర్చినట్లు ఎస్ఐ నిరంజన్ రెడ్డి ఆదివారం తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన హనుమంతు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు. సంఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు సేకరిస్తున్నట్లు, గ్రామంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొనకుండా చూస్తామన్నారు.



శ్రీ రేణుక చార్య జయంతి వేడుకల్లో పాల్గొన్న వీర శైవ లింగాయత్‌లు

## ఘనంగా రేణుకాచార్య స్వామి జయంతి వేడుకలు

**కనేకల్ (తెలుగోడు), మార్చి 1 :**
శ్రీ రేణుక చార్య స్వామి జయంతి వేడుకలను ఆదివారం వీరశైవ లింగాయత్‌లు ఘనంగా నిర్వహించారు, కనేకల్ గ్రామంలో ఉదయం శ్రీ చిక్కనేశ్వర స్వామి దేవస్థానంలో స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు, అనంతరం వీరశైవ సంఘం వారు శ్రీ రేణుక చార్య స్వామి చిత్రపటాన్ని ట్రాక్టర్ నందు ఉంచి ప్రత్యేక పుష్పాలతో అలంకరించి స్వామి వారి చిత్రపటాన్ని బస్టాండు నుంచి దిగవగేరి ప్రాంతం వరకు పుర వీధుల గుండా స్వామివారిని ఘనంగా ఊరేగించారు, అనంతరం స్వామి వారికి అఖండ హారతి ఇచ్చి ప్రసాద వితరణ గావించారు ఈ కార్యక్రమంలో వీర శైవ లింగాయత్ సంఘం వారు పాల్గొన్నారు.

## శ్రీవారిని దర్శించుకున్న సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్

**తిరుమల, మార్చి 1:**
తిరుమలకు విచ్చేసిన సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ ఆదివారం ఉదయం తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారిని దర్శించుకున్నారు. జస్టిస్ సూర్యకాంత్‌కి ఆలయ మహాద్వారం వద్ద టీటీడీ ఆలయ చైర్మన్ బి. ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి, జిల్లా ఎస్పి ఎల్. సుబ్బారాయుడు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అర్చకులు మేళతాళాల మధ్య వేద మంత్రాలు నడుమ సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి దర్శనం తరువాత భారత ప్రధాన న్యాయమూర్తి ని అర్చకులు శేష వస్త్రం కప్పిన అనంతరం రంగనాయకుల మండపంలో వేద పండితులు వేదాశీర్వచనం అందజేశారు. అటు తరువాత టీటీడీ చైర్మన్ బి. ఆర్. నాయుడు, ఈవో ముద్దాడ రవి చంద్ర, అదనపు ఈవో సి.హెచ్.వెంకయ్య చౌదరి గౌ,భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి తీర్థప్రసాదాలు, స్వామి వారి చిత్రపటాన్ని అందజేశారు. అనంతరం సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి శ్రీ వరహస్వామి వారిని దర్శించుకున్నారు



అమరావతిలో హైకోర్టు న్యాయమూర్తుల నివాస సముదాయాల ప్రారంభోత్సవంలో పాల్గొన్న సీజేఐ జస్టిస్ సూర్యకాంత్ , హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్ సింగ్ ఠాకూర్

# ఆర్ఎంపి ఇష్టారాజ్యం..!

### జెండా దిబ్బ గ్రామస్తుల ఫిర్యాదు..

**సంగం (తెలుగోడు), మార్చి 1 :**
జెండాదిబ్బ గ్రామపంచాయతీలోని ఆర్ఎంపీ డాక్టర్ నిబంధనలకు విరుద్ధంగా వైద్యశాలను నిర్వహిస్తున్నారని స్థానికులు ఆరోపించారు. ఆర్ఎంపీ డాక్టర్‌పై స్థానికులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ఎంపీ డాక్టర్ అంటే. వైద్యశాల పేరు ప్రథమ చికిత్స ఆలయం నమోదు చేసి ఉండాలి. ఎవరైనా రోగి వస్తే ఫస్ట్ ప్రథమ చికిత్స మాత్రమే



ఆర్ఎంపిపై ఫిర్యాదు చేస్తున్న జెండాదిబ్బ గ్రామస్తులు



ఆర్ఎంపిపై ఫిర్యాదు చేస్తున్న జెండాదిబ్బ గ్రామస్తులు

చేయాల్సి ఉందని నిబంధనలు ఉన్నాయి. ఇక్కడ ఈ డాక్టర్ అన్ని సేవలు చేస్తున్నారని స్థానికులు తెలుపుతున్నారు.

ఇందుకు సంబంధించిన వైద్యం చేసేందుకు లైసెన్స్ పొంది ఉండాలి. అయితే ఇందుకు విరుద్ధంగా ఈ వైద్యశాలలో ఒకే చోట వైద్యం మందులు విక్రయాలు సాగించటం జరుగుతుందని స్థానికులు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వపరంగా ఒక వ్యక్తికి రెండు లైసెన్సులు ఎలా ఇస్తారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఈ విషయాలపై గత నెల 23వ తేదీ గ్రీవెన్స్‌లో స్థానికులు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు చేసిన సమయంలో ఆన్లైన్ ద్వారా సంబంధిత అధికారికి సిఫార్సు చేశారు. ఈ శాఖ అధికారి పట్టించుకోకుండా ప్రజా వైద్యశాలకు ఫిర్యాదును తరలించారని బాధితులు తెలిపారు. అయితే ప్రజా వైద్యశాలకు సంబంధించి సంగం మండలం వైద్య అధికారి ఆర్ఎంపి డాక్టర్‌పై విచారణ జరిపించారు. ఆయనే స్వయంగా రంగంలోకి దిగి ఇక్కడ ఉన్న విషయాలన్నీ నమోదు చేసి సంబంధిత జిల్లా అధికారులకు నివేదిక పంపించారు.

# ఆపదలో ఆపన్నహస్తం

### కష్టాల్లో ఉన్న కార్యకర్త కుటుంబానికి రూ. లక్ష ఆర్థికసాయం.. పార్టీ కార్యకర్త కుటుంబానికి అండగా నిలిచిన ఎం.ఎస్.రాజు..

**రోళ్ల (తెలుగోడు), మార్చి 1 :**
మడకశిర శాసనసభ్యులు, టీటీడీ పాలకమండలి సభ్యులు శ్రీసత్యసాయిజిల్లా తెలుగుదేశంపార్టీ అధ్యక్షులు ఎం.ఎస్.రాజు మనసున్న మారాజు అని మరోసారి నిరూపించుకొన్నారు. జిల్లా పార్టీ అధ్యక్షుడిగా, స్థానిక శాసనసభ్యుడిగా మాత్రమే కాకుండా మనసున్న మంచి వ్యక్తిగా ఆపదలో ఉన్న పార్టీ కార్యకర్త కుటుంబాన్ని ఆదుకున్నారు. మడకశిర మండలం, ఛత్రం గ్రామానికి చెందిప తెలుగుదేశంపార్టీ కార్యకర్త విజయ్ కుమార్



అనారోగ్యంతో మంచానికే పరిమితమైన కార్యకర్త విజయ్

పక్షవాతం వ్యాధికి గురై, మంచానికే పరిమితమై, ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతూ, కుటుంబ పోషణ సైతం కష్టతరమైన విషయం ఎం.ఎస్.రాజు దృష్టికి స్థానిక నాయకులు



లక్ష రూపాయల చెక్ అందిస్తున్న ఎమ్మెల్యే ఎం ఎస్ రాజు

తీసుకెళ్లారు. ఒక్క క్షణం కూడా ఆలోచించకుండా పార్టీ కార్యకర్త విజయ్ కుమార్ సతీమణిని పిలిపించి జరిగిన విషయంపై ఆరా తీశారు. చాలా ఇబ్బందుల్లో ఉన్నామని చెప్పిన విజయ్ కుమార్ సతీమణి భావోద్వేగంతో చెప్పిన మాటలు విన్న ఎం.ఎస్.రాజు చలించిపోయారు. వెనువెంటనే సొంత నిధులు లక్ష రూపాయల చెక్కును విజయ్ కుమార్ సతీమణికి అందజేశారు. కుటుంబానికి అండగా నిలబడతామని, తెలుగుదేశంపార్టీ కార్యకర్తలను ఆదుకోవడం తన కర్తవ్యమని ఆమెకు ఎం.ఎస్.రాజు భరోసా ఇచ్చారు. ఇబ్బందుల్లో ఉన్న తమ కుటుంబాన్ని లక్ష రూపాయలతో ఆదుకున్న ఎమ్మెల్యే ఎం.ఎస్.రాజుకు విజయ్ కుమార్ భార్య కృతజ్ఞతలు, ధన్యవాదాలు చెప్పారు. ఏ ఇబ్బంది ఉన్నా పార్టీ అండగా నిలబడుతుందని భరోసా ఇచ్చారు. ఎమ్మెల్యే అంటే ఎన్నికలప్పుడు మాత్రమే కనిపించే వాడు కాదు.... ఎన్నికల ఫలితాలు వచ్చినప్పటి నుండి మళ్లీ ఎన్నికలు వచ్చేవరకు కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకునేవాడే నిజమైన నాయకుడు అని తమ ఎమ్మెల్యే నిరూపిస్తున్నారు అని మడకశిర ప్రజలు ఎం.ఎస్.రాజు పై ప్రశంశల వర్షం కురిపిస్తున్నారు.

# అంగన్వాడీల డిమాండ్లను కూటమి ప్రభుత్వం పరిశీలిస్తోంది

### ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ ..

**అనంతపురం రూరల్ (తెలుగోడు), మార్చి 1 :**
అంగన్వాడీలు గత కొన్ని రోజులుగా ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని, వారి న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలిస్తోందని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ అన్నారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా అంగన్వాడీలు తమ సమస్యలపై దీక్షలు చేస్తున్న నేపథ్యంలో ఆయన స్పందించారు. ప్రభుత్వం ఈ 20 నెలల కాలంలో అంగన్వాడీలకు చేసిన మంచిని ప్రతి ఒక్కరూ గుర్తించాలన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 5,000 మినీ అంగన్వాడీ కేంద్రాలను పూర్తి స్థాయి అంగన్వాడీ కేంద్రాలుగా అప్‌గ్రేడ్ చేస్తోందన్నారు. ఇందులో భాగంగా మినీ అంగన్వాడీ కార్యకర్తలకు టీచర్‌గా పదోన్నతి కల్పించి, పూర్తి స్థాయి వేతనాలు అందించనుందన్నారు. అలాగే కొత్తగా 5,000 మంది అంగన్వాడీ సహాయకులను నియమించనుందన్నారు. ఏళ్ల తరబడి అంగన్వాడీలు ఎదురుచూసిన గ్రాట్యుటీ కోసం బడ్జెట్‌లోనే రూ.20 కోట్లు కేటాయించి, అధికారంలోకి వచ్చిన 9 నెలల్లోనే అంగన్వాడీలకు అండగా నిలిచిందన్నారు. అంగన్వాడీ కేంద్రాల హాజరు 70 శాతం నుంచి 96 శాతానికి పెరగడం కూటమి పాలనకు వచ్చిన ప్రత్యక్ష ఫలితమే అన్నారు. 58,204 మంది అంగన్వాడీ వర్కర్లు, సూపర్‌వైజర్లు, బ్లాక్ కోఆర్డినేటర్లకు రూ.75 కోట్ల వ్యయంతో 5జీ స్మార్ట్‌ఫోన్లు అందించిందన్నారు. ఈ స్మార్ట్‌ఫోన్ల ద్వారా గర్భిణీలు, బాలింతలు, చిన్నారులకు మరింత వేగంగా, సమర్థవంతంగా సేవలు అందుతున్నాయని ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తెలిపారు. అంగన్వాడీలకు ప్రతి నెల ఒకటో తేదీననే వేతనాలు అందేలా చర్యలు తీసుకుని, జీతాల ఆలస్యానికి శాశ్వతంగా కూటమి ప్రభుత్వం చెక్ పెట్టిందన్నారు. రాష్ట్రవ్యాప్తంగా అంగన్వాడీ కేంద్రాల్లో తాగునీటి సౌకర్యాలు, మరుగుదొడ్ల నిర్మాణానికి రూ.86.68 లక్షలు విడుదల చేసి, ఒక్కో కేంద్రానికి ప్రత్యేకంగా నిధులు కేటాయించిందన్నారు. ప్రభుత్వం ఇంత మంచి చేసినప్పుడు మీ వేతనాలు, ఇతర వాటి విషయంలో ఎందుకు ఆలోచించదన్నారు. ఇటీవల ముఖ్యమంత్రి దృష్టికి మీ డిమాండ్లు తీసుకెళ్లామని.. మీకు న్యాయం చేసేందుకు ఆయన కూడా సానుకూలంగా ఉన్నారన్నారు. గత ప్రభుత్వం రాష్ట్ర ఆర్థిక రంగాన్ని దివాళ తీసి వెళ్లిందన్నారు.



# ఫేక్ అకౌంట్లతో దూషిస్తే ఇంటికే వస్తా

సోషల్ మీడియాలో ట్రోలింగ్‌పై మరోసారి తీవ్రంగా స్పందించారు రేణూ దేశాయి. ఫేక్ అకౌంట్లు సృష్టించి ప్రతిరోజూ అసభ్య పదజాలంతో దూషిస్తున్న వారిపై ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. తనపై దుర్భాషలాడిన ప్రతి ఒక్కరిని గుర్తించి వారి ఇంటికే వెళ్లి, వారి తల్లిదండ్రుల ముందు నిలబెడతానని హెచ్చరించారు.

జంతువుల సంరక్షణ కోసం ఎన్‌జీవో నడుపుతున్న రేణూ దేశాయి ఇటీవల విడుదల చేసిన వీడియోలో తన ఆవేదనను వ్యక్తం చేశారు. ప్రస్తుతం అమ్మవారి దీక్షలో ఉన్నప్పటికీ తన వస్త్రధారణపై కూడా అసభ్య వ్యాఖ్యలు చేస్తున్నారని మండిపడ్డారు. "నైట్ కి రేట్ ఎంత" అంటూ దిగజారిన కామెంట్లు చేస్తున్నారని తెలిపారు.

విడాకులు తీసుకున్నప్పటి నుంచి తన వ్యక్తిగత జీవితంపై నిరంతరం దాడులు జరుగుతున్నాయని చెప్పారు. తాను తీసుకున్న భరణం, మద్దతు ఇస్తున్న రాజకీయ పార్టీ, పిల్లలు వంటి విషయాలను వదలకుండా కామెంట్లు చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.

జనవరిలో వీధి కుక్కల సమస్యపై నిర్వహించిన సమావేశంలో తాను చేసిన వ్యాఖ్యలను వక్రీకరించి సోషల్ మీడియా, యూట్యూబ్ చానళ్లు టార్గెట్ చేశాయని ఆరోపించారు. "వంద కుక్కలు ఉంటే అందులో పది పిచ్చివి ఉండొచ్చు. ఆ పది కుక్కల కోసం మిగతా తొంభై కుక్కలను చంపకూడదని మాత్రమే చెప్పాను" అని స్పష్టం చేశారు. అయితే తన మాటలను ఎడిట్ చేసి వేరే ఘటనలతో కలిపి ప్రచారం చేశారని తెలిపారు.

"ముఖం చూపించడానికి ధైర్యం లేని పిరికివాళ్లు ఇలా చేస్తారు. దమ్ముంటే మీరు చేసే పనిని మీ తల్లిదండ్రులు, అక్కాచెల్లెళ్లకు చూపించండి. వారు మీకు నేర్పిన సంస్కారం ఇదేనా?" అంటూ తీవ్రంగా ప్రశ్నించారు. తాను వీధి కుక్కల సంరక్షణ కోసం ఎన్‌జీవో ప్రారంభించానని, మనుషుల కోసం కాదని పేర్కొన్నారు. తనపై దుష్ప్రచారం చేస్తున్న వారందరినీ వెతికి పట్టుకుని వారి కుటుంబాల ముందు నిలబెడతానని హెచ్చరించిన రేణూ దేశాయి, ఇకనైనా ఈ విధానాన్ని మానుకోవాలని విజ్ఞప్తి చేశారు.



# ఒకే ఫ్రేమ్‌లో మెగా బ్రదర్స్



టాలీవుడ్ ఇండస్ట్రీ ఎప్పటి నుంచో కొన్ని డ్రీమ్ కాంబోలను తెరపై చూడాలని ఆశగా ఎదురుచూస్తోంది. అందులో ముఖ్యంగా మెగా బ్రదర్స్ కాంబినేషన్ ప్రత్యేక స్థానం సంపాదించుకుంది. మనం సినిమా విడుదలైనప్పటి నుంచి ఒకే కుటుంబానికి చెందిన స్టార్ హీరోలు కలిసి నటించిన మల్టీస్టారర్‌కు అభిమానుల్లో ఎంత ఆదరణ ఉంటుందో నిరూపితమైంది. అదే తరహాలో మెగా ఫ్యామిలీ నుంచి కూడా ఒక భారీ మల్టీస్టారర్ రావాలని అభిమానులు ఎప్పటి నుంచో కోరుకుంటున్నారు.

ఇప్పుడు ఆ ఆశకు ఊపిరి పోసేలా ఒక వార్త సోషల్ మీడియాలో వైరల్ అవుతోంది. మెగాస్టార్ చిరంజీవి, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ కలిసి ఒక సినిమాలో నటించబోతున్నారనే టాక్ ఇండస్ట్రీ వర్గాల్లో వినిపిస్తోంది. ఇటీవలే ఓ ప్రముఖ దర్శకుడు వీరిద్దరికి ఓ కథను వినిపించగా, కథ బేసిక్ ఐడియా ఇద్దరికీ నచ్చినట్లు సమాచారం.

ఈ కథలో ఒక హీరో ఎక్కువ, మరొక హీరో తక్కువ అనే తేడా లేకుండా ఇద్దరికీ సరిసమాన ప్రాధాన్యత ఉంటుందట. యాక్షన్, ఎమోషన్, సెంటిమెంట్ అన్నీ కలగలిపిన కమర్షియల్ ఎంటర్‌టైనర్‌గా స్క్రిప్ట్ రూపొందిందని టాక్. ముఖ్యంగా అభిమానులను దృష్టిలో పెట్టుకుని ఫ్యాన్ ఎలిమెంట్స్‌ను నెక్స్ట్ లెవెల్‌లో డిజైన్ చేసి వినిపించారట దర్శకుడు. అయితే స్క్రిప్ట్ నచ్చినప్పటికీ పూర్తి స్థాయిలో ఓకే చెప్పేందుకు కొంత సమయం కావాలని చిరు--పవన్ కోరినట్లు తెలుస్తోంది.

ఈ వార్త బయటకు రావడంతో మెగా అభిమానుల్లో ఆనందానికి అవధులు లేకుండా పోయాయి. "ఇద్దరూ ఒకే ఫ్రేమ్‌లో కనిపిస్తే బాక్సాఫీస్ రికార్డులు బద్దలవుతాయి" అంటూ సోషల్ మీడియాలో కామెంట్ల వర్షం కురుస్తోంది. ఇప్పటివరకు పవన్ కళ్యాణ్, చిరంజీవి సినిమాల్లో అతిథి పాత్రలలో మాత్రమే కనిపించారు. ముఖ్యంగా శంకర్ దాదా ఎంబీబీఎస్ సినిమాలో ఒక పాటలో, శంకర్ దాదా జిందాబాద్ సినిమాలో ఒక ఫైట్ సీన్‌లో పవన్ మెరిశారు.

అయితే పూర్తి స్థాయి మల్టీస్టారర్‌గా ఇద్దరూ కలిసి నటిస్తే అది చరిత్రాత్మక కాంబినేషన్ అవుతుందని సినీ విశ్లేషకులు అభిప్రాయపడుతున్నారు. అన్నదమ్ములిద్దరూ కలిసి నటించే తొలి చిత్రం అవుతుందనే అంచనాలు అభిమానుల్లో ఉత్సాహాన్ని రెట్టింపు చేస్తున్నాయి.

# దుబాయ్‌లో చిక్కుకున్న సోనల్ చౌహాన్

పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో దుబాయ్‌లో చిక్కుకున్న బాలీవుడ్, టాలీవుడ్ నటి సోనల్ చౌహన్ భారత ప్రభుత్వాన్ని సహాయం కోరారు. ప్రస్తుతం దుబాయ్ అంతర్జాతీయ విమానాశ్రయంలో ఉన్న ఆమె, విమానాల రాకపోకలు నిలిచిపోవడంతో ఇండియాకు తిరిగి చేరుకోవడం సాధ్యంకాక ఆందోళన వ్యక్తం చేశారు.


సోషల్ మీడియా వేదికగా స్పందించిన సోనల్ చౌహన్, గౌరవనీయులైన ప్రధాని నరేంద్ర మోదీగారిని ట్యాగ్ చేస్తూ విన్నపం చేశారు. "ప్రస్తుత సంక్షోభ పరిస్థితుల వల్ల నేను దుబాయ్‌లో చిక్కుకుపోయాను. విమానాల రాకపోకలు నిలిచిపోయాయి. ఇండియాకు ఎలా చేరుకోవాలో తెలియడం లేదు. నేను సురక్షితంగా ఇంటికి చేరేందుకు ప్రభుత్వం సహాయం చేయాలి" అని కోరుతూ చేతులు జోడించిన చిహ్నాన్ని జత చేశారు.

ఇరాన్‌పై నెలకొన్న యుద్ధ వాతావరణం కారణంగా ఇజ్రాయెల్, బహ్రెయిన్, ఖతర్, యూఏఈ తదితర దేశాల్లో ఉన్న భారతీయులు తీవ్ర ఆందోళనలో ఉన్నారు. స్వదేశానికి తిరిగి వెళ్లే మార్గం కోసం ఎదురుచూస్తున్నారు. సినీ నటుడు మంచు విష్ణు, బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పీవీ సింధు కూడా అక్కడే ఉన్నట్లు సమాచారం.

తెలుగు ప్రేక్షకులకు సుపరిచితమైన సోనల్

సోనల్ చౌహన్ తెలుగు చిత్ర పరిశ్రమలో 'రెయిన్' చిత్రంతో అడుగుపెట్టారు. ఆ తరువాత 'లెజెండ్', 'పండగ చేస్కో', 'షేర్', 'సైజ్ జీరో', 'డిక్టేటర్', 'ఎఫ్3', 'ద ఘోస్ట్' వంటి చిత్రాల్లో నటించి మంచి గుర్తింపు పొందారు. ఇటీవల 'ఆదిపురుష్' చిత్రంలో మండోదరి పాత్రలో కనిపించారు.

పశ్చిమాసియా ఉద్రిక్తతల మధ్య దుబాయ్‌లో చిక్కుకున్న ఈ స్టార్ నటి చేసిన విజ్ఞప్తి ప్రస్తుతం సోషల్ మీడియాలో చర్చనీయాంశంగా మారింది. కేంద్ర ప్రభుత్వం స్పందించి అవసరమైన చర్యలు తీసుకుంటుందనే ఆశాభావం వ్యక్తమవుతోంది.



Publisher and Owned by S.BABAJAN, Main Road, Nallamada, ANANTHAPUR, Andhrapradesh-515501. Printed At SUNDAY PRINTING PRESS, SVN Coliny, Gunturu... EDITOR- B.SHANKAR PRASAAD, PRGI No- APTEL/25/A2739 ..Cell No - 99634 96956, 73827 12780.